జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శనివారం 21 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 281 | వెల: రూ.5 | పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528


# సందడిగా మారిన విశాఖ



- నగరమంతా సందడిగా మారనుండటంతో రెండు రోజుల పాటు అధికారిక సెలవులు
- ఒకవైపు ఆరోగ్య చైతన్యాన్ని మిళితం చేస్తూ యోగా దినోత్సవం
- మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు
- బీచ్ రోడ్ నుంచి భీమిలి వరకు చేపలవేట ఆపేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆంక్షలు
- మొత్తానికి విశాఖ వాసులకు ఇది ఓ ప్రత్యేకమైన అనుభూతిగా మిగిలిపోనుంది!





**విశాఖపట్టణం**

విశాఖపట్నం నగరం ఇప్పుడు పండగలా మారిపోయింది. నగరమంతా సందడిగా మారనుండటంతో రెండు రోజుల పాటు అధికారిక సెలవులు ప్రకటించారు. ఒకవైపు ఆరోగ్య చైతన్యాన్ని మిళితం చేస్తూ యోగా దినోత్సవం జరిగేందుకు సిద్ధమవుతుండగా, మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ఊపందుకున్నాయి. బీచ్ రోడ్ నుంచి భీమిలి వరకు చేపలవేటు ఆపేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆంక్షలు విధించింది. మొత్తానికి విశాఖ వాసులకు ఇది ఓ ప్రత్యేకమైన అనుభూతిగా మిగిలిపోనుంది! విశాఖపట్నం.. అందమైన బీచ్‌లు, ఆహ్లాదకర వాతావరణం, ఇప్పుడు అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేంద్రంగా మారుతోంది. జూన్ 21న జరగనున్న యోగా డే వేడుకలు విశాఖను మరోసారి దేశవ్యాప్తంగా దృష్టిలోకి తెస్తున్నాయి. ఈ వేడుకలు చిన్న మట్టిలో కాదు.. ప్రధాన వేదికగా ఆర్కే బీచ్ రోడ్డునే మలుస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో యోగా ప్రదర్శన జరగడం ఇదే తొలిసారి కావొచ్చు! ఈ వేడుకల్లో ప్రత్యేకతేమిటంటే ? దాదాపు 25,000 మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్యనమస్కారాలు చేయబోతున్నారు. ఇది నమ్మలేని విషయం లాగే ఉంటుంది కానీ నిజం! ఒకే సమయంలో వేలాది మంది విద్యార్థులు విశాఖ బీచ్ మీద సూర్యుడికి నమస్కారం చేస్తూ యోగా చేస్తే.. ఆ దృశ్యం చూడడానికి దేశమంతా ఎదురు చూస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రుల బృందం కూడా హాజరుకానుంది. ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ కూడా యోగా దినోత్సవ సందర్భంగా విశాఖకు రానున్నారు. ఆయన పర్యటన నేపథ్యంలో నగరంలో భద్రతా ఏర్పాట్లు చాలా కట్టుదిట్టంగా చేపట్టారు. ముఖ్యంగా బీచ్ రోడ్ పరిసరాల్లో పోలీసులు, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ, ఇంటలిజెన్స్ విభాగాలు కలిసి పటిష్టంగా గస్తీలు పెడుతున్నాయి. ఈ రెండు రోజులు.. జూన్ 20, 21 తేదీల్లో విశాఖపట్నం నగరంలో - మిగతా3లో

## వారిని ఓ కంట కనిపెట్టండి

- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం..
- అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని
- సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకూ బాగుంటాయి
- వాటిని ఆచరణలో పెడతాము. ఆ డైలాగులకు అనుగుణంగా మేం ప్రవర్తిస్తాం అంటే చూస్తూ ఊరుకోం
- ఇది ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదు



వైఎస్ జగన్ పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పర్యటనలో వైసీపీ పార్టీ నేతలు చంపేస్తాం, నరికేస్తాం అంటూ బహిరంగంగానే విధ్వంసం సృష్టించడంపై.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. అనుమతులు లేకుండా డీజేలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు నిబంధనలు తుంగలో తొక్కి ఇరువురు వ్యక్తుల మరణానికి కారణమైనందుకు ఇప్పటికే పోలీసులు చర్యలకు దిగారు. అల్లర్లకు కారణమైన వారిపై వరసగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసాంఘిక శక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని - మిగతా3లో



## ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం

- ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారు
- రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణం
- ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా పడుకోలేను: మోదీ
- ఎన్డీయే హయాంలోనే బిహార్ అభివృద్ధి దిశగా సాగుతోంది
- "బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ.

## యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం

- యోగా మన సంస్కృతి, మన సంపద
- శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిద్దాం
- విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా డే నుంచి దీనికి నాంది పలుకుదాం
- ప్రధాని మోదీ సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం.



**విశాఖపట్నం:**

యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం చేరుకున్నారు. జిల్లా నాయకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. "యోగా మన సంస్కృతి, మన సంపద. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిద్దాం. విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా డే నుంచి దీనికి నాంది పలుకుదాం. ప్రధాని మోదీ సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. రాష్ట్రంలో వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం. వారసత్వంగా వచ్చిన యోగాను మనమంతా ఆచరించటంతో పాటు భవిష్యత్ తరాలకూ అందిద్దాం" అని పిలుపునిచ్చారు.



## ఆంగ్లం సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం

- ప్రపంచంతో పోటీ పడే ప్రతి విద్యార్థి ఆంగ్ల భాష నేర్చుకోవాలి
- భాజపా, ఆర్‌ఎస్‌ఎస్‌లకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం ఇష్టం లేదు
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

## 'బుచ్చయ్య.. వయసుకు తగ్గ మాటలు మాట్లాడయ్యా'




- బుచ్చయ్య చౌదరి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు
- జగన్ తల నరికితే తప్పేంటి అంటారా..?
- బుచ్చయ్య చౌదరి వయస్సు తగ్గట్లుగా నడుచుకోవాలి
- 77 ఏళ్లు వచ్చినా ఇంకా ఏదో ఆశించి మాట్లాడుతున్నారు.
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్

**తాడేపల్లి**

టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వయసుకు తగ్గట్లు మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బుచ్చయ్య చౌదరి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. జగన్ తల నరికితే తప్పేంటి అంటారా..?. బుచ్చయ్య చౌదరి వయస్సు తగ్గట్లుగా నడుచుకోవాలి. 77 ఏళ్లు వచ్చినా ఇంకా ఏదో ఆశించి మాట్లాడుతున్నారు. చంద్రబాబు మెప్పు కోసం - మిగతా3లో



## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్

- ఢిల్లీకి రానున్న 1,000 మంది భారతీయ విద్యార్థులు
- శుక్రవారం అర్ధరాత్రి చేరిన తొలివిమానం
- ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేత

# ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం

**పాట్నా:** బీహార్‌ను ఆటవిక రాజ్యంలోని నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

**పేదలకు మరిన్ని ఇళ్లు**

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ



సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి-పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యోగీ సర్కార్ లిస్ట్ మామూలుగా లేదే

**లక్నో :** 2017లో బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుంచి ఉత్తరప్రదేశ్ అంతటా పోలీసు ఎన్‌కౌంటర్లలో గణనీయమైన పెరుగుదల ఉందని ఇటీవలి డేటా వెల్లడిస్తోంది. ఈ ఆపరేషన్లలో అనేక మంది నేరస్థులు హతమయ్యారు. అలాగే వేల సంఖ్యలో పలువురు గాయపడ్డారు. అయితే తాజాగా మొట్ట మొదటిసారి ఉత్తరప్రదేశ్ పోలీసులు గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర నేర నిరోధక కార్యకలాపాలపై సమగ్ర డేటాను విడుదల చేశారు.యాక్టింగ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) రాజీవ్ కృష్ణ విడుదల చేసిన డేటా ప్రకారం.. 2017 నుంచి 2024 మధ్య పోలీసు ఎన్‌కౌంటర్లలో మొత్తం 234 మంది కరడుగట్టిన నేరస్థులు హతమయ్యారు. అదనంగా ఈ ఘర్షణల్లో 9,202 మంది నేరస్థులు గాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నేరాలకు వ్యతిరేకంగా కఠినమైన జీరో-టాలరెన్స్ విధానాన్ని అమలు చేసింది. గత ఎనిమిది సంవత్సరాలలో ఉత్తరప్రదేశ్ అంతటా 14,741 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. ఈ ఆపరేషన్లలో 30,293 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు. అయితే ఎన్‌కౌంటర్ ఆపరేషన్స్ సమయంలో పోలీసులు కూడా మరణించారు. విధి నిర్వహణలో నేరస్థులతో పోరాడుతున్నప్పుడు 18 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1,700 మంది పోలీసులు గాయపడ్డారు.డేటా ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే మీరట్ జోన్‌లో అత్యధికంగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. మొత్తం 4,183 ఆపరేషన్లలో 7,871 మంది నేరస్థులు అరెస్టు



అయ్యారు. 2,839 మంది గాయపడ్డారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో 77 మంది భయంకరమైన నేరస్థులు మరణించారు. అలాగే ఇద్దరు పోలీసులు వీరమరణం పొందగా, 452 మంది గాయపడ్డారు. వారణాసిలో1,041 ఎన్‌కౌంటర్‌లలో 2,009 మంది నేరస్థులను అరెస్టు చేశారు. 605 మంది గాయపడ్డారు, 26 మంది మరణించారు. 96 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. అలాగే ఆగ్రా జోన్‌లో 2,288 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. దీని ఫలితంగా 5,496 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు, 715 మంది గాయపడ్డారు. 19 మంది మరణించారు. ఎన్‌కౌంటర్ సమయంలో 56 మంది పోలీసులు కూడా గాయపడ్డారు.

# మేం నీళ్లెందుకు ఇవ్వాలి?
# కెనాల్ ప్లాన్‌ను వ్యతిరేకించిన ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు అనుసంధానించే కెనాల్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యతిరేకించారు. మొదట తమ జలాలను తాము వాడుకోవాలని, జమ్మూలో కరవు తరహా పరిస్థితి ఉందని, తామెందుకు పంజాబ్‌కు జలాలు పంపాలని ఆయన ప్రశ్నించారు. సింధు జాలాల వ్యవస్థ నుంచి జమ్మూకశ్మీర్ షేర్‌లోని మిగులు జలాలను పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌కు మళ్లించేందుకు 113 కిలోమీటర్ల కెనాల్ ప్రాజెక్టుకు ప్లాన్ జరుగుతోంది. దీనిపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, సింధు జలాల ఒప్పందం కింద పంజాబ్ ఇప్పటికే జలాలు పొందుతోందని చెప్పారు. 'మాకు అవసరమైతే వాళ్లు నీళ్లిస్తారా?' అని ప్రశ్నించారు. పఠాన్‌కోటలో షాపుర్‌కండి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి 45 ఏళ్లుగా పంజాబ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాల మధ్య



వివాదం కొనసాగుతోంది. 1979లో రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినా కేంద్రం మధ్యవర్తిత్వంలో 2018లోనే ఇది కార్యరూపం దాల్చింది. పాత వివాదాన్ని ఒమర్ అబ్దుల్లా ప్రస్తావిస్తూ, సింధు జలాల ఒప్పందం కింద ఇప్పటికే పంజాబ్‌కు నీళ్లందుతున్నాయని, మాకు అవసరమైనప్పుడు వాళ్లు నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. తమను చాలా ఏళ్లుగా కంటతడిపెట్టేలా వాళ్లు (పంజాబ్) చేశారని, ఇప్పుడు ముందుగా మేము జలాలు వాడుకుని, ఇతరుల గురించి ఆలోచిస్తామని చెప్పారు. కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు ఉద్దేశించిన జలాలను పంజాబ్, రాజస్థాన్, హర్యానాకు మళ్లించాలని కేంద్రం నిర్ణయించినట్టు పలు మీడియాలో ఇటీవల కథనాలు వచ్చాయి. ఈ నిర్ణయాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేసేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జలశక్తి మంత్రి ఇప్పటికే దృష్టి సారించారని చెబుతున్నారు. పాకిస్థాన్‌కు వెళ్లే చుక్కనీరు కూడా వృథా కారాదని మంత్రిత్వ శాఖ పట్టుదలగా ఉందని చెబుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై కఠిన చర్యల్లో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.

## 'మరో లిబియా' కావద్దనే..!
# ట్రంప్ వెనకడుగుకు కారణం ఇదేనా?

**ఇంటర్నెట్ డెస్క్:** ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడంపై చర్చ జరుగుతున్న వేళ.. రెండు వారాల్లోపు అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ నుంచి కీలక ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే విషయంలో డొనాల్డ్ ట్రంప్ (%ణశీఖుశ్రీ‌ఎ ఎతీబఎజూ%) ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ తాము రంగంలోకి దిగితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని.. ఇరాన్ కూడా మరో లిబియా మాదిరిగా మారవచ్చనే ఆందోళన ట్రంప్ వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఆఫ్రికా దేశమైన లిబియాలో పాలన మార్పునకు మద్దతిచ్చిన అమెరికా గతంలో సైనిక చర్య చేపట్టింది. దీంతో 2011లో గడాఫీ ప్రభుత్వం అంతమైంది. కానీ, అప్పటి నుంచి లిబియా అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో ఒకవేళ ఇరాన్ యుద్ధంలోనూ జోక్యం చేసుకొని సుప్రీం లీడర్ ఖమేనీని తప్పిస్తే పరిస్థితులు తీవ్ర గందరగోళంగా మారుతాయని ట్రంప్ ఆలోచిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనాలు



పేర్కొన్నాయి. ఇరాన్ మరో లిబియాగా మారొద్దని అధ్యక్షుడు కోరుకుంటున్నారని, అలా జరిగితే దీర్ఘకాలం అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు అధ్యక్షుడి సన్నిహిత వర్గాలు చెప్పినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ ఇటీవల దాడులు మొదలుపెట్టకముందే ఇరాన్ పరిస్థితిపై ట్రంప్ చాలా ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. అంతేకాదు.. అఫ్గానిస్థాన్, ఇరాక్‌ల ప్రస్తావన తెచ్చిన ఆయన.. అమెరికా సైనిక చర్యతో ఈ రెండు దేశాలు దీర్ఘకాలంగా అస్థిరత్వాన్ని ఎదుర్కొంటున్నట్లు చెప్పినట్లు తెలిసింది. ఒకవేళ ఇరాన్‌పై దాడులు చేసినా.. అణుకేంద్రాలపై గగనతల దాడులు పరిమిత స్థాయిలోనే ఉండవచ్చని ట్రంప్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా దాడుల్లో ఇరాన్ ప్రభుత్వం కూలిపోతే ట్రంప్ యంత్రాంగాన్ని నిందించవద్దని వైట్‌హౌస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఖమేనీ పాలనను అంతం చేయడం తమ ఉద్దేశం కాదని, కేవలం అణు స్థావరాలే తమ లక్ష్యమని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్పందించిన వైట్‌హౌస్.. శాంతి చర్చల కోసం ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇందు కోసం రెండు వారాల గడువు ఇస్తున్నట్లు ప్రకటన చేసింది. నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ అనేక కోణాల్లో ఆలోచిస్తున్నారని, ప్రపంచ నేతల మాటలతోపాటు అమెరికా ప్రజలు, సలహాదారుల సూచనలను ఆయన పరిగణనలోకి తీసుకుంటున్నారని తెలిపింది.

## ఆంగ్లం సిగ్గుచేటు కాదు..
## విద్యార్థుల అభివృద్ధికి ఊతం



**ఇంటర్నెట్ డెస్క్:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్రమంత్రి అమిత్ షా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లిషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం సిగ్గుచేటు కాదని.. విద్యార్థుల సాధికారతకు అది చిహ్నమన్నారు. ప్రపంచంతో పోటీ పడే ప్రతి విద్యార్థికి ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉందని.. మాతృ భాషతో పాటు ఆంగ్లం తప్పకుండా నేర్పాలని సూచించారు. ఆ భాష విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని తెలిపారు. భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం ఇష్టం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. అందుకే వారిని విద్యకు దూరం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి మాతృభాష ఎంత ముఖ్యమో.. ఆంగ్ల భాష కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని.. వాటిని మనం గౌరవించాలన్నారు. అదే సమయంలో ప్రపంచంతో పోటీ పడడానికి వీలుగా ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**అంధ విద్యార్థుల గీతాలాపన.. కంటతడి పెట్టిన రాష్ట్రపతి**

ఇటీవల ఓ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ఈ దేశంలో ఇంగ్లిషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని అన్నారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని పేర్కొన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు.

## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్



**న్యూఢిల్లీ:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసివేసిన ఎయిర్‌స్పేస్‌ను తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకుపోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరేషన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకువస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు.

**తొలివిమానం**

కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలివిమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేసింది. అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకువచ్చింది. వీరంతా ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకోవడంతో అక్కడి నుంచి వారిని ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకువచ్చారు.

## ఇజ్రాయెల్‌తో యుద్ధం..
## ఇరాన్‌కు చైనా రహస్య సాయం..?



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఎనిమిదో రోజుకు చేరింది. ఇరు దేశాలు పరస్పరం క్షిపణుల వర్షం కురిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఇరాన్‌లోని అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగించింది. ప్రతిగా క్లస్టర్ బాంబులతో కూడిన క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి టెహ్రాన్ ఎక్కుపెట్టింది. రెండు దేశాల మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇక ఈ యుద్ధంలో ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు పలుకుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ ఒంటరైంది. ఈ క్రమంలో ఇరాన్‌కు చైనా సాయం చేస్తున్నట్లు తెలిసింది. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా ఆయుధాలు పంపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. మూడు మిస్టరీ కార్గో విమానాలను టెహ్రాన్‌కు పంపినట్లు తెలిసింది. ఈనెల 14 నుంచి మూడు బోయింగ్-747 విమానాలు చైనాలోని వివిధ ప్రాంతాల నుంచి టెహ్రాన్ వైపు వెళ్లినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. పలు నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట గత శుక్రవారం దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే అంటే శనివారం తొలి బోయింగ్ విమానం ఇరాన్‌వైపు వెళ్లింది. ఆ తర్వాత ఆదివారం రెండో విమానం, సోమవారం మూడో బోయింగ్ విమానం చైనా నుంచి బయల్దేరి వెళ్లాయి. ఈ రకమైన బోయింగ్ 747లను భారీ సైనిక పరికరాలను రవాణా చేయడానికి ఉపయోగిస్తారు. ఈ మూడు విమానాలూ కజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్కెనిస్థాన్ వైపు నుంచి ఇరాన్ సమీపంలోని వెళ్లాయి. ఆ తర్వాత అవి రాడార్ నుంచి కనిపించకుండా పోయాయి. మూడు విమానాల తుది గమ్యస్థానం లక్సెంబర్గ్‌గా ఉన్నప్పటికీ అవి అక్కడికి వెళ్లలేదు. దీంతో అవి ఇరాన్ వైపు వెళ్లి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా కార్గో విమానాల్లో సైనిక పరికరాలు సాయంగా పంపుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

## ప్రజలకు.. 'వైఎస్ జగన్ అంటే నమ్మకం..

# చంద్రబాబు అంటే మోసం'

**గుంటూరు:** వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా,సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించి కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. వైఎస్ జగన్ రెంట పాళ్ల పర్యటనపై విడుదల రజిని శుక్రవారం మీడియా మాట్లాడారు. పల్నాడుజిల్లా చిలకలూరిపేట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రోజురోజుకూ వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ, కూటమి పాలనపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహంను చూసి భయంతో రాజకీయంగా ఆయన ఉనికినే లేకుండా చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ఎటువంటి దారుణమైన వ్యాఖ్యలు చేశాడో మొత్తం రాష్ట్ర ప్రజలంతా చూశారని అన్నారు. ఈ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు ఏకంగా మాజీ సీఎం ఎస్ జగన్‌ను భూస్థాపితం చేస్తానంటూ మాట్లాడారు. ఆయన పార్టీలోని మరో నేత బుచ్చయ్యచౌదరి విచక్షణ మరిచి వైఎస్ జగన్‌కు హాని కలిగిస్తామనే రీతిలో దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఇవ్వన్నీ చూస్తుంటే టీడీపీ తెర వెనుక ఏదో కుట్ర చేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయి.



**ప్రజాధరణకు పల్నాడు పర్యటనే సాక్ష్యం**

పల్నాడు జిల్లాలో వైఎస్ జగన్ పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకునేందుకు ఎంత ప్రయత్నించినా ప్రజలు మాత్రం ఆయనను అక్కున చేర్చుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ చెందిన నాయకుడు నాగమల్లేశ్వరరావును పోలీసుల ద్వారా తీవ్రంగా వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ వస్తున్న నేపథ్యంలో మొత్తం పోలీస్ యంత్రాంగాన్ని మోహరించి, ఆయన పర్యాటనను విఫలం చేయాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం వ్యవహరించింది. ఈ పర్యటనకు వాహనాలను అందించకూడదని ట్రావెల్ ఏజెన్సీలను బెదిరించారు, పెట్రోల్ బంక్‌లు, హొటళ్ళను బలవంతంగా మూసివేయించారు. అయినా కూడా ప్రజలు పెద్ద ఎత్తున వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చారు. వైఎస్ జగన్‌కు అడుగుడుగునా స్వాగతం పలుకుతూ రోడ్లపై పోటెత్తారు. వైఎస్ జగన్ అంటేనే దేశంలోనే అత్యంత ప్రజాధరణ పొందిన నాయకుడు. ఈ కూటమి ప్రభుత్వ మోసాన్ని గుర్తించామంటూ వైఎస్ జగన్‌కు ప్రజలు తమ మద్దతును ప్రకటించారు.

**చనిపోయిన వారిపైనా రాజకీయమా?**


వైఎస్ జగన్ పర్యటనలో దురదృష్టవశాత్తు ఇరువురు చనిపోతే, దానిని కూడా వివాదంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం శతవిధాలుగా ప్రయత్నించింది. వైఎస్ జగన్ కాన్వాయి వాహనం తగిలి సింగయ్య అనే వ్యక్తి చనిపోయారంటూ ఒక తప్పుడు ప్రచారం చేశారు. అలాగే సత్తెనపల్లిలో ఒక యువకుడు సొమ్మసిల్లి పడిపోయాడు, అతడిని ఆసుపత్రికి తరలించే సరికే అతడు చనిపోయాడు. ఈ ఘటనలు గురించి తెలియగానే వైఎస్ఆర్‌సీపీ నేతలు వారి కుటుంబసభ్యులను పరామర్శించడం, ఆ కుటుంబాలకు ఆర్థిక సాయంను అందచేయడం కూడా జరిగింది. ఆ కుటుంబాల పట్ల మా బాధ్యతను ఎక్కడా మరిచిపోలేదు. చివరికి వారి అంత్యక్రియల్లో కూడా పార్టీ నేతలు ఎంతో బాధతో పాల్గొని, ఆ కుటుంబాలను ఓదార్చడం జరిగింది.

**అమాయకుల ప్రాణాలను బలికొన్నది చంద్రబాబు కాదా?**

చంద్రబాబు గతంలో సీఎంగా ఉండి, గోదావరి పుష్కరాల సందర్భంగా తన ప్రచారయావతో 29 మందిని బలితీసుకున్నారు. ఇరుకుసందుల్లో సభలను పెట్టి, జనాలను ఎక్కువగా చూపాలనే ప్రయత్నంలో భాగంగా కందుకూరిలో ఎనిమిది మందిని పొట్టనపెట్టుకున్నారు. అలాగే గుంటూరులో టీడీపీ తరుపున చీరెల పంపిణీ పేరుతో మహిళలకు ఆశచూపి, తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితిలో ముగ్గురు చనిపోయారు. చంద్రబాబు అసమర్థ పాలనలో తిరుపతి క్యూలెన్లలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వీరి కుటుంబాలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. ఈ మరణాలు చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలు కావా? తన వల్ల జరిగిన దారుణాలను చంద్రబాబు మరిచిపోయారా?' అని ప్రశ్నించారు.

# ఏపీలో మావోల కదలికలు


**విశాఖపట్టణం :** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా చేపట్టిన ఆపనేషన్లల్లో మావోయిస్తులకు ద్వెమీద దెబ్బతగులుతూనే ఉంది. వరుస ఆపరేషన్లల్లో మావోయిస్టు పార్టీ కీలక సెంట్రల్ నేతలు ఒక్కొరు హతమవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతం నుంచి రంపచోడవరం డివిజన్‌వైపు మావోనేతలు ఇటువైపుగా వరుస కట్టడం వారి ఉనికికే ప్రమాదాన్ని తీసుకొస్తుందా అంటే అవుననే అంటున్నారు. పోలీసులు చేపడుతున్న కూంబింగ్‌లో వరుసగా మావోల కీలక నేతలు హతమవుతున్న నేపథ్యంలో జూన్ 18 మావోలకు మరింత పెద్దదెబ్బ తగిలినట్లయ్యింది.. రంపచోడవరానికి 26 కిలోమీటర్లు దూరంలో ఉన్న దేవిపట్నం మండలం కించకూరు కాకవాడ గండి దట్టమైన అటవీప్రాంతంతంలో పోలీసులకు, మావోలకు జరిగిన ఎదురుకాల్పుల్లో కీలక నేతలు మృత్యువాత పడడం సంచలనంగా మారింది.చాలా రోజులుగా రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో మావోల కదలిక కూడా అంతంత మాత్రంగా మారిందని అయితే తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ప్రాంతంలో మావోయిస్టులు కదలికలు ఉన్నాయనే తెలుస్తోంది. పోలీసులు, మావోల మధ్య జరిగి ఎదురు కాల్పుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రావి వెంకట హరిచైతన్య అలియాస్ అరుణ(మావోయిస్టు నేత చలపతి సతీమణి), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అంజు మృతి చెందారు. దీంతో రంపచోడవరంలో మావో కదలికలున్నాయన్న విషయం బాహ్య ప్రపంచానికి తెలిసింది.. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు పనిచేస్తుండగా వరుస సంఘటనలతో కీలక సెంట్రల్‌కమిటీ నేతలు దుర్మరణం చెంది పార్టీ కోలుకోలేని స్థితిలోకి వెళ్లింది.. ఈక్రమంలోనే ఏవీబీ నుంచి ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతం మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వచ్చే రంపచోడవరం డివిజన్‌లోకి మావోయిస్తు పార్టీ కీలక నేతలు వరుస కడుతున్నారని పోలీసలు గుర్తించారు. ఈక్రమంలోనే ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు కీలక నాయకుడిగా ఉన్న



చలపతిరావు అలియాస్ చలపతి కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం డివిజన్ చింతూరు ఏజెన్సీ ప్రాంతం ముక్కాళి అటవీప్రాంతంలో జరిగింది. ఆ తరువాత ఇదే జిల్లాలోని వై.రామవరం ఏజెన్సీ ప్రాంతంలోని యార్లగడ్డ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టు నేతలు మృతిచెందారు. ఈప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది.. కగార్ ఆపరేషన్‌లో భాగంగా గ్రేహౌండ్స్ బలగాలు రంపచోడవరం డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తుండడానికి కారణం ప్రధానంగా ఈ ప్రాంతంలోకి గత కొంతకాలంగా మావోయిస్తులు వస్తుండడం కారణంగా నిలుస్తోందంటున్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతి పరిజ్ఞానంతో మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా పెట్టిన పోలీసులు దట్టమైన అడవుల్లో మావోల ప్రతీ కదలికను ఇట్టే పసిగడుతున్నట్లు తెలుస్తోంది. దట్టమైన అడవుల్లో సైతం థర్మల్ డ్రోన్ల సాయంతో మావోల కదలికలను పసిగట్టగలుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నుంచి అల్లూరి జిల్లాలోని రంపచోడవరం డివిజన్‌లోకి అటవీమార్గం ద్వారా ఇటీవల కాలంలో వచ్చిన పలువురు మావోయిస్టు పార్టీ కీలకనేతలు ఎదురు కాల్పుల్లో మృతిచెందారు. రంపచోడవరం సమీపంలోని మారేడుమిల్లి అటవీప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు ఇద్దరు మృతి చెందడం కూడా మావోలు మరో మార్గంలేని స్థితిలోనే రంపచోడవరం డివిజన్‌లో తలదాచుకుని మృత్యువాతపడ్డారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# అమాత్య...కోసం మారారా

**ఏలూరు :** దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చాపకింద నీరులా పనిచేసుకుపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన తన నాయకత్వాన్ని మరింతత పటిష్టం చేసుకునే దిశగా అడుగులువేస్తున్నట్లు కనపడుతుంది. వివాదాలకూ దూరంగా ఉంటున్నారంటే చింతమనేనిప్రభాకర్ కు పార్టీ పెద్దల నుంచి ఏదో సూన లాంటిది వచ్చినట్లే కనపడుతుంది. అందుకే చింతమనేని ప్రభాకర్ గత ఏడాది కాలంగా కాంట్రవర్సీ జోలికి వెళ్లకుండా తన పనులను మాత్రం నెరవేర్చుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. చింతమనేని ప్రభాకర్ తెలుగుదేశంపార్టీలో ఫైర్ బ్రాండ్ లీడర్. గతంలో ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కునే వారు. ఆయన వివాదంలో లేకపోతేనే నాడు వార్త అయ్యేది. కానీ నేడు ఏడాది నుంచి తన పనేదో తానుచేసుకుపోతున్నారంటే ఏదో ఉందన్నది పార్టీలోనూ, దెందులూరు నియోజవర్గం టీడీపీ క్యాడర్ లో జరుగుతున్న చర్చ. తెలుగదేశంపార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా చింతమనేని ప్రభాకర్ స్టయిల్ వేరుగా ఉంటుంది. వివాదాలే రాజకీయంగా ఆయన ఎదుగుదలకు అడ్డంకిగా మారాయన్నది వాస్తవం. పార్టీ అంటే పడిచచ్చిపోయే నేత కావడంతో చింతమనేని ప్రభాకర్ ను టీడీపీ నాయకత్వం దూరం పెట్టదు.చింతమనేని ప్రభాకర్ సీనియర్ రాజకీయ నాయకుడు. 2019 ఎన్నికల్లో చింతమనే ప్రభాకర్ దెందులూరు నుంచి ఓటమి పాలయ్యారు. ఆయనపై వైసీపీ ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేసింది. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఆ సానుభూతితో పాటు కూటమి హవా కూడా తోడవ్వడంతో 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరిపై విజయం సాధించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చింతమనేని ప్రభాకర్ పూర్తిగా సాధుజీవిగా మారారు. గతంలో అధికరారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు చింతమనేనిని ఇలా చూడలేదన్నది పార్టీ కార్యకర్తల నుంచి వినిపిస్తున్న మాట. సన్నిహితుల సూచనలతో... 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అప్పటి ఎమ్మార్వో వనజాక్షిని బెదిరించిన వైనం చింతమనేని ప్రభాకర్ ను రాజకీయంగా ఇబ్బందులపాలు చేసింది. అంతేకాదు పార్టీ ప్రతిష్టను కూడా దిగజార్చింది. తర్వాత కూడా ఆయన తగ్గలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయనలో మార్పు వచ్చినట్లు కనిపిస్తుంది. తాను నిత్యం నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తున్నా ఎందుకు ఓటమి చెందానన్నది తనకే అర్థంకావడం లేదన్నది చింతమనేని ప్రభాకర్ సన్నిహితులవద్ద వ్యాఖ్యానిస్తుంటారట. అయితే వివాదాల వల్లనే ఆయనను జనం 2019 ఎన్నికల్లో దూరం పెట్టారని సన్నిహితులు చెప్పడంతో ఇప్పుడు ఆయన పెద్దగా కనిపించడం లేదు. అలాగనిపార్టీలోనూ, నియోజకవర్గంలో నూయాక్టివ్ గా లేదని కాదు. నిత్యం



ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ మంచిపేరు తెచ్చుకునే ప్రయత్నం నిరంతరం చేస్తున్నారు. ంశ్రీబనీ .. 2014 లో పార్టీ గెలిచినప్పుడు చింతమనేని ప్రభాకర్ కు మంత్రి పదవి దక్కకపోవడానికి వివాదాలే కారణమని అంటున్నారురర. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ నేతగా ఉన్న ప్పటికీ ఆయనకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా పదవులు దక్కలేదు. 2009, 2014లో వరసగా దెందులూరు నియోజకవర్గం నుంచి గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ కోసం జెండా వదలలేదు. కార్యకర్తలకు అండగా నిలబడటంలో ముందున్నారు. అనేక కేసులు తనపై నమోదవుతున్నా చింతమనేని ప్రభాకర్ బెదరలేదు. భయపడలేదు. పదవి రావాలంటే కొన్నాళ్ల పాటు కాంట్రవర్సీకి దూరంగా ఉండాలని అధినాయకత్వం చెప్పిన మాటలను ఆయన పాటిస్తున్నారట. తన ప్రత్యర్థి అబ్బయ్య చౌదరిపై కేసులు బనాయించి విదేశాలకు వెళ్లేలా చేసి నియోజకవర్గంపై తన పట్టును మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## 'బుచ్చయ్య.. వయసుకు తగ్గ మాటలు మాట్లాడయ్యా'

-మొదటిపేజీ తరువాయి



తాపత్రయం పడుతున్నారు. జగన్ పేరు వింటేనే టీడీపీ నేతలు భయపడుతున్నారు. ఏపీ రాష్ట్ర రాజకీయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ప్లకార్డులో పుష్ప సినిమా డైలాగులు రాసినా కేసు పెట్టారు. టీడీపీ కుట్రలకు వారి పార్టీ కార్యకర్త రవితేజ బలయ్యాడు.రవితేజ టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న సభ్యుడు. వాళ్ళ కుటుంబం మొత్తం టీడీపీలోనే ఉన్నారు.రవితేజకు ఆ ప్లకార్డు ఇచ్చి పంపింది టీడీపీనే. దానికి టీడీపీ మంత్రి రామానాయుడు పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు.ఈ కుట్ర మొత్తం టీడీపీ ఆఫీస్‌లోనే జరిగింది. సినిమాలో డైలాగ్‌లను పట్టించుకోవద్దని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా చెప్పారు. జగన్ పేరు వింటేనే టీడీపీకి భయం వేస్తోంది. జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న జగన్‌కు రక్షణ లేదు. ప్రతిపక్షాన్ని.. జగన్‌ను భూస్థాపితం చేస్తామని చంద్రబాబు మాట్లాడారు. మీ భాషను మీ వీడియోలు చూస్తే అర్థం అవుతుంది. నారా లోకేష్ కద్రాయర్లతో పరిగెత్తిస్తామన్నారు. డిప్యూటీ సీఎం ఊగిపోతూ అనేక మాటలు మాట్లాడారు. మీరు పరమార్శలకు వెళ్తే మేం వద్దన్నమా..?

**బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యలపై సాకే శైలజానాథ్ దిమ్మతిరిగే కౌంటర్**

జగన్ పట్ల కుట్రలు జరుగుతున్నాయేమో అన్న అనుమానాలున్నాయి. అందులో భాగంగానే జగన్ భద్రతను కూడా తగ్గించారు. జగన్ లేకుంటే మిమ్మల్ని ప్రశ్నించే వాళ్లు కూడా ఉండరని భావిస్తున్నారా..?.కుప్పంలో అప్పు కట్టలేదని ఒక మహిళను చెట్టుకు కట్టేస్తే.. ఐదు లక్షలు ఇచ్చి పాపం కడిగేసుకుంటారా?. ప్రకాశం జిల్లాలో మీ నేత వీరయ్య చౌదరిని హత్య చేసింది మీ వాళ్లు కాదా?.రాజకీయాల్లో హింసాత్మక ప్రవృత్తిని పెంచి పోషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై వందల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. ఓడినా.. మీరు ఎంత హేళన చేస్తున్నా మిమ్మల్ని ప్రశ్నిస్తుంది ఒక్క జగన్ మాత్రమే. భూస్థాపితం చేస్తా అని చంద్రబాబు మాట్లాడితే తప్పులేదా..?'అని ప్రశ్నించారు.

## వారిని ఓ కంట కనిపెట్టండి

-మొదటిపేజీ తరువాయి

ఉపముఖ్యమంత్రి పవన్ పోలీసులకు ఆదేశమిచ్చారు. అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని సూచించారు. జగన్ ఓదార్పు పర్యటనలో వైసీపీ నేతలు సృష్టించిన హడావుడి అంతా ఇంతా కాదు. 2029లో తాము అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరికేస్తామంటూ పుష్ప డైలాగులతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమయ్యారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ ఘాటుగా స్పందించారు. సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకూ బాగుంటాయి..వాటిని ఆచరణలో పెడతాము. ఆ డైలాగులకు అనుగుణంగా మేం ప్రవర్తిస్తాం అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇది ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని అన్నారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఎవరైనా చట్ట ప్రకారం నియమనిబంధనలను పాటించేలా చూడాలని సూచించింది. ఈ క్రమంలోనే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించదని.. కచ్చితంగా అలాంటివారిపై రౌడీ షీట్లు తెరిచి అసాంఘిక శక్తులను అదుపు చేస్తామని అన్నారు. అశాంతిని, అభద్రతను కలిగించేవారికి మద్దతుగా అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడుతున్నవారి పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారిని ఓ కంట కనిపెట్టాలని పోలీసులను ఆదేశించారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తామని బహిరంగంగా ప్రదర్శనలు చేసేవారిని కట్టడి చేయకపోగా.. వారిని సమర్థించేలా మాట్లాడేవారి నేరమయ ఆలోచనలను చేసేవారిని ప్రజలంతా గమనించాలి కోరారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమే అని మరచిపోకూడదని పేర్కొన్నారు.

## సందడిగా మారిన విశాఖ

-మొదటిపేజీ తరువాయి

సెలవులు ప్రకటించడం ద్వారా ట్రాఫిక్, జనసంద్రం వంటి సమస్యలను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు. పర్యటనలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ముందస్తు చర్యల్లో భాగంగా, ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు చేపల వేటపై నిషేధం విధించారు. అంటే ఈ రెండు రోజులు సముద్రంలో పడవలు కనిపించవు. ఎందుకంటే భద్రతే ముఖ్యం. ఇది మత్స్యకారులకు తాత్కాలిక అసౌకర్యంగా కనిపించినా, దేశ భద్రత పరంగా చూస్తే, అవసరమైన జాగ్రత్తే. ఈ కార్యక్రమాల్లో భాగంగా మరో ప్రాధాన్యత ఇచ్చిన అంశం.. ప్రత్యామ్నాయ వేదికగా ఆంధ్రా యూనివర్శిటీ క్యాంపస్‌లో కూడా ఏర్పాట్లు. అంటే మోదీ పర్యటన, వాతావరణ పరిస్థితులను బట్టి వేడుకల వేదికను మార్చే అవకాశం కూడా ఉంటుంది. అధికారులు ఎలాంటి అవాంతరం లేకుండా వేడుకలు సజావుగా జరిగేలా అన్ని కోణాల్లో ప్రణాళికలు సిద్ధం చేశారు.. ఈ వేడుకలు కేవలం యోగా ప్రదర్శనలు మాత్రమే కాదు. ఇది మన సంప్రదాయం, ఆరోగ్య జీవనశైలి, దేశ గౌరవం అన్నీ కలిసొచ్చే సందర్భం. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ద్వారా ప్రభుత్వం వారి సామాజిక ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పింది. యోగా వంటి సంప్రదాయాన్ని అందరికీ చేరువ చేయడంలో ఇది ఒక చారిత్రక ముందడుగు అని చెప్పొచ్చు. విశాఖ నగరం ప్రస్తుతం పూర్తిగా యోగా మూడ్‌లోకి వెళ్లిపోయింది. రోడ్డులన్నీ శుభ్రంగా మెరిసిపోతున్నాయి. ఫ్లెక్సీలు, డెకరేషన్లు, బీచ్ రోడ్ వెంట ప్రత్యేక ఏర్పాట్లు నగరాన్ని మరోసారి వేడుకల నగరంగా మార్చాయి. అంతే కాదు, కేంద్రం నుండి పలువురు ఉన్నతాధికారులు, యోగా గురువులు, ఆయుర్వేద, నాటురోపతి రంగాల నిపుణులు కూడా విశాఖకు రానున్నారు. సారాంశంగా చూస్తే, ఈ యోగా డే వేడుకలు విశాఖను మరోసారి జాతీయ వార్తలకీ, ప్రపంచ దృష్టికీ తెస్తున్నాయి. బీచ్ సిటీగా మాత్రమే కాకుండా, ఆధ్యాత్మికత, ఆరోగ్య చైతన్యానికి కేంద్రంగా మారుతోన్న విశాఖకు ఇది ఒక పెద్ద గుర్తింపు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, అధికారుల సమర్థ కార్యాచరణ, ప్రజల సహకారం.. ఇవన్నీ కలిసొస్తే విశాఖ నగరానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం ఖాయం. ఇప్పుడైతే చెప్పాలి.. విశాఖలో ఇప్పుడు ప్రతి శ్వాస యోగా శ్వాసే!

## లిక్కర్ లీడర్ల వంతు....

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎప్పుడు ఏంజరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ ఈ కేసులో తొమ్మిది మంది అరెస్టయ్యారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తో ఇక వరసగా రాజకీయ నేతలు అరెస్ట్‌అవుతారన్న ప్రచారం జరుగుతుంది. 2019 నుంచి 2024 మధ్య మద్యంవిక్రయాల్లో పెద్దయెత్తున కుంభకోణం జరిగిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. కొన్ని నెలల నుంచి దీనిపై సుదీర్ఘంగా దర్యాప్తు చేస్తున్న సిట్‌అధికారులు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన క్లూ ఆధారంగా రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజ్ కేసిరెడ్డి కీలక నిందితుడని పేర్కొన్నారు. ఇదే కేసులో రాజ్ కేసిరెడ్డి, చాణక్య, పైలా దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఇక తాజాగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా అరెస్టయ్యారు. ఆయనతో పాటు చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడును కూడా అరెస్ట్ చేశారు. ఇక ఇదే కేసులో రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి పేరు బాగా ప్రచారంలో ఉంది. మిథున్ రెడ్డి ఇప్పటికే తనను అరెస్ట్ చేయవద్దంటూ ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో ఈ కేసులో బిగ్ బాస్ పేరు కూడా ప్రముఖంగా వినిపస్తుంది. దీంతో చెవిరెడ్డి తర్వాత ఎవరు అరెస్టవుతారన్న దానిపై ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. లిక్కర్ స్కామ్ కేసులో 37, 38 నెంబరు నిందితులుగా ఉన్నవారిని అరెస్ట్ చేయడంతో ఇక తర్వాత ఎవరన్నది హాట్ టాపిక్ గా మారింది. కోట్లాది రూపాయలను విదేశాలకు తరలించారని ఇప్పటికే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేశారు. రిమాండ్ లో ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, రాజ్ కేసిరెడ్డిలను విచారించారు. మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ కూడా దర్యాప్తు చేస్తుంది. అయితే చెవిరెడ్డి అరెస్ట్ తో రాజకీయ నేతల అరెస్ట్ ల పర్వం ప్రారంభమయినట్లే కనిపిస్తుంది. ఇక దీంతో తర్వాత మిథున్ రెడ్డి ని అదుపులోకి తీసుకుంటారా? లేక అంతకంటే అత్యున్నత స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తారా? అని వైసీపీ నేతల్లో టెన్షన్ మొదలయింది.

# పార్టీ పదవులు అలంకారం మాత్రమే కాదు కష్టపడి పని చేయాలి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లుబిగుత్తి జూన్ 20 (ప్రజా జ్యోతి):** శుక్రవారం గుత్తి పట్టణం సితార ఫంక్షన్ హాల్ నందు గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ అధ్యక్షతన గుంతకల్లు నియోజకవర్గం రెగ్యులర్ అబ్జర్వర్ తిమ్మయ్య చౌదరి, గుంతకల్లు నియోజకవర్గం ఎలక్షన్ అబ్జర్వర్ పర్వీన్ భాను,గుంతకల్లు నియోజకవ ర్గం రూరల్ అబ్జర్వర్ పర్వాత నేని శ్రీధర్ బాబు మరియు గుంతకల్లు టౌన్ అబ్జర్వర్ ఆవుల కృష్ణయ్య మరియు కేసీ హరి సమక్షంలో గుంతకల్లు పట్టణ మరియు మండల సంస్థగత కమిటీ నిర్మాణం మరియు ఎన్నిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం టౌన్ మరియు మండల అధ్యక్ష పదవుల ఆశవహుళ నుండి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు పార్టీ పదవి ఆశించడంలో తప్పు లేదు పార్టీ ఎవరిని ఆదేశిస్తే వారికి పదవులు వరిస్తాయని ఎవరికి అధ్యక్షులు గా పదవి వచ్చిన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసి పార్టీ ని మరింత బలోపేతం చేయాలని అన్నారు.పదవులు అనేవి అలంకారం కోసం కాదని పార్టీ ఒక పదవి ఇచ్చిందంటే ఆ వ్యక్తి పార్టీ లో అందరినీ కలుపుకొని పోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. ఇప్పుడు మీరు ఇచ్చిన అర్జీలను అన్ని పార్టీ కేంద్ర కార్యాలయం కి పంపడం జరుగుతుంది అని తెలిపారు. ఆశవహులు ఎంతమంది వున్నా పదవి అనేది ఒకరికే వస్తుంది కాబట్టి ఎవరు బాధ పడకుండా పార్టీకి పని చెయ్యాలని ఇంకా రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా పదవులు రాని వారికి అవకాశం కల్పిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.మన అభ్యర్థి ఎవరిని నిలబెట్టిన అందరు కలిసి పని చేసి విజయం సాధించాలని అదే విదంగా వైసీపీ పార్టీ ని భూస్థాపితం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో గుత్తి పట్టణం మరియు మండల మరియు పామిడి పట్టణ మరియు మండల టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రమ శిక్షణకు మారుపేరు నారా భువనేశ్వరి

మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

116 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన టిడిపి నాయకులు



**గుంతకల్లు జూన్ 20 (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** సహనం,కర్మ శిక్షణకు మారుపేరు నారా భువనేశ్వరి అని అనంతపురం నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి కొనియాడారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమార్తె, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాన్యశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భంగా అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ నందు గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారా భువనేశ్వరి ఆయురారోగ్యా లతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని 116 టెంకాయలు కొట్టి, దేవాలయం లో ప్రత్యేక పూజలు చేయించా రు.ఈ సందర్భంగా బల్లా పల్లవి మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రతి మహిళ నారా భువనేశ్వరుని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఒక ముఖ్యమంత్రి కూతురుగా, మరో ముఖ్యమంత్రి భార్యగా, కాబోయే ముఖ్యమంత్రి తల్లిగా సరికొత్త గొప్ప గౌరవం నారా భువనేశ్వరికి దక్కుతుంద న్నారు. చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సమయంలో నారా భువనేశ్వరి ప్రజల మధ్యలోకి వచ్చి టిడిపి నాయకులకు మనోధైర్యం నింపడాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారాయణ స్వామి యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, టిడిపి నాయకులు మణికంఠ బాబు, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు మాజీ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్, టిఎన్టియుసి నగర అధ్యక్షుడు పూల బాషా, టిడిపి మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి రజాక్, టిడిపి నాయకులు చెక్క నాగేంద్ర, టైలర్ సీనా, చెర్లోపల్లి రామకృష్ణ, కరణం సత్తి, హనుమాన్, గోవిందు, మహిళా నాయకులు లక్ష్మి నాయుడమ్మ, కవిత, గోసియా నాగేంద్రమ్మ శిరిశాల రాజు లక్ష్మీదేవి, లక్ష్మి ఎ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీల్లో రక్తహీనత నివారణ, లింగ వివక్ష పై అవగాహన



**గుంతకల్లు జూన్ 20 (ప్రజా జ్యోతి) :** జిల్లా కలెక్టర్ మరియు వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సూచనల మేరకు గర్భిణీ స్త్రీలకు రక్తహీనత మరియు లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ మరియు డాక్టర్ హరిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల్లో రక్తహీనత (అనీమియా) ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా నిలుస్తోంది. అనేక అధ్యయనాల ప్రకారం, ప్రతి ఇద్దరు గర్భిణీ లలో ఒక గర్భిణీ స్త్రీకి రక్తహీనత సమస్య ఉంది. ఇది తల్లి ఆరోగ్యంతో పాటు భవిష్యత్తులో పుట్టబోయే శిశువు ఆరోగ్యానికీ ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. గర్భధారణ సమయంలో శరీరానికి ఎక్కువ ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 అవసరం అవుతుంది. అయితే, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, ఎక్కువగా గర్భధారణలు, హెల్త్ చెకప్ లలో నిర్లక్ష్యం వంటివి రక్తహీనతకు కారణమవుతా యన్నారు. ప్రభుత్వం ద్వారా కొన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని అవి ఉచిత ఐరన్-ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, రక్త పరీక్షలు (హిమోగ్లోబిన్ స్థాయి), ఆహార అవగాహన శిబిరాలు, ఏఎన్ఎం, ఆషా, సి హెచ్ ఓ ల ద్వారా ఇంటింటి ఆరోగ్య సలహాలు, ఐ సి డి ఎస్ ద్వారా పోషకాహార పంపిణీ. ముఖ్యంగా జనాభాలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీలు రోజూ పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వం అందించే ఐరన్ మాత్రలు తప్పకుండా తీసుకోవాలని, నెల నెలా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. లేకపోతే తల్లి-శిశువు మరణాల రిస్క్ పెరుగుతుంది. సమాజంలోని అందరూ ఈ సమస్యపై అవగాహన కలిగి ఉండాలి మరియు గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. డివైహెచ్ఈఓ వేణు గోపాల్ మాట్లాడుతూ మన దేశంలో నానాటికీ అభివృద్ధి సాధిస్తున్నా, గర్భిణీ స్త్రీలపై లింగ వివక్ష సమస్య ఇప్పటికీ కొనసాగుతోందని, బాలిక పుట్టడాన్ని ఆపే ఉద్దేశంతో గర్భంలోనే లింగ నిర్ధారణ చేసి, ఆడ శిశువులను అబార్షన్ చేసే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇది చట్టపరంగా నేరం మాత్రమే కాదు, మానవత్వానికి మచ్చ కూడా అని అన్నారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన

గాదిలింగేశ్వర బాబు ( చిన్న బాబు)




**గుంతకల్లు జూన్ 20 (ప్రజా జ్యోతి)**బీ పట్టణం నందు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు నియోజకవర్గం యువ నాయకుడు ఎన్. గాదిలింగే శ్వర బాబు ( చిన్న బాబు) దీక్ష శిబిరం వద్దకు చేరుకొని దీక్షకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా బాదలింగేశ్వర బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సమానం పనికి సమాన వేతనం ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షులు బి.సుంకప్ప, వైస్సార్సీపీ 3 వార్డ్ ఇంచార్జ్ శేఖర్,నాగసముద్రం సర్పంచ్ నరసింహులు,నక్కనదొడ్డి ఎంపీటీసీ జింకల రామాంజనే యులు,వైస్సార్సీపీ పట్టణ వైస్ ప్రెసిడెంట్ యు. హనుమే ష్,వెంకటం పల్లి సీనియర్ నాయకులు లౌక్యనాయక్, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు సుంకన్న, గుండాల గోపాల్,మైనారిటీ నాయకులు హాజీ, మల్లేష్, నాయకులు టీజీ సురేష్, సురేంద్ర పాల్గొన్నారు.

# ఘనంగా రెవిన్యూ డే వేడుకలు





**పోదూరు, జూన్ 20,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ బెంకట్ ).**జూన్ 20 రెవెన్యూ డే సందర్భముగా పోదూరు మండలంలో రెవిన్యూ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల స్థాయి అధికారులు, సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు అందరూ పాల్గొని శుభాకాంక్షలు తెలిపవ్. ఈసందర్బంగా తాహసిల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్ మాట్లాడుతూ 1540 సంవత్సరంలో రాజరిక పాలన ముగిసి భూ పరిపాలన ఏర్పాటు అయినదన్నారు. 1640లో కంచర్ల గోపన్న అనే శ్రీరామదాసు ఖమ్మం పాల్వంచ పరిగణలో తాహసీల్దారుగా. పనిచేసారన్నారు.పిదప అధికారికంగా 1786 జూన్ 20వ తేదీన బ్రిటిష్ హయాంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో " బోర్డ్ ఆఫ్ రెవెన్యూ" ఏర్పడి చట్టబద్ధంగా రెవిన్యూ పరిపాలన మొదలై, జరుగుచున్నదని తెలిపారు.ఈ కార్యక్రమం లో రెవెన్యూ శాఖ అన్ని శాఖలకు మాతృ శాఖ వంటిదని ఆయన అన్నారు. నీటి సంఘం డిసి చైర్మన్ రాంబద్ర రాజు , పార్టీ నాయకులు రమేష్ రాజు పోదూరు ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి.



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లవానిపల్లి గ్రామమునకు చెందిన దండు లాలేప్ప (58 ) అను వ్యక్తి నిన్నటి రోజు తన మోటార్ సైకిల్ పైన టమోటా నార తీసుకోని గుత్తి నుండి చెరువు తాండ మీదుగా ఉప్పర్లపల్లి వైపు వెళ్ళుతుండగా మార్గం మధ్యలో చెరువు తాండ వైపు నుండి తనకు ఎదురుగా ఎర్రగుడి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి తన యొక్క మోటార్ సైకల్ ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ లాలెప్ప మోటార్ సైకిల్ ను ఢీ కొట్టగా లాలెప్ప కింద పడి కాలు వద్ద తీవ్రమైన రక్త గాయం అవ్వడంతో అతనిని గుత్తి ఆసుపత్రికి అక్కడ నుండి కర్నూల్ లోని శ్రీ చక్ర ప్రవేట్ ఆసుపత్రికి తీసుకోని వెళ్లగా తనకు కలిగిన గాయల నుండి కోలుకోనలేక రాత్రి చనిపోయాడు అని తన కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనది.

## కంచికచర్ల తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు



**కంచికచర్ల, జూన్ 20 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల తహసిల్దారుగా సిహెచ్ నరసింహారావు శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. కంచికచర్ల డిప్యూటీ తహసిల్దారుగా పనిచేస్తున్న వేమూరి మానస, కంచికచర్ల తాహసిల్దారుగా ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వహించారు. నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు గుడివాడ ఆర్డిఓ కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పనిచేసి సెలవు పై ఉన్నారు. తాజాగా నరసింహారావును కంచికచర్ల తాహసిల్దారుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. నరసింహారావు గతంలో కంచికచర్ల రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా, పిడిఎస్ డిటీ గా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు చేపట్టిన తాహసిల్దారును డీటీ మానస, ఆర్ ఐ వెంకట్, సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

## సూర్యలంక బీచ్‌లో 10 వేల మందితో యోగా సభకు భారీ ఏర్పాట్లు

అంతర్జాతీయ యోగ దినోత్సవానికి సిద్ధం అవుతున్న బాపట్ల జిల్లా

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల మండలం సూర్యలంక బీచ్ తీరంలో నిర్వహించనున్న భారీ యోగా కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం 5 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది ఈ కార్యక్రమానికి 10 వేల మంది ప్రజలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించాం అని తెలిపారు ప్రజలందరూ యోగ దినోత్సవానికి పెద్దఎత్తున హాజరై ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరయ్యే వారెవరూ ఇబ్బందులకు గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా బాపట్ల మున్సిపాలిటీ డి ఈ కృష్ణారెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల భూములు కబ్జాకు. కబ్జా కోరులు ప్రయత్నాలు





కాపాడాలని అరకు ఇంచార్జ్ దొరకు రైతులు ఫిర్యాదు

**అనంతగిరి జూన్.20 ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం.కొత్తూరు గ్రామపంచాయతీ పరిధి తుంబన వలస. బెడ్డగూడ. గంగవరం.దంసరాయ్ తట్టవలస గ్రామాల గిరిజన రైతులు తుంబన వలస పరిసర ప్రాంతాలలో గల ఎల్.టి. ఆర్ భూములను గత 30. సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం రైతులు ఆధీనంలో సుమారు 40.ఎకరాలు భూమి ఉండగా 106. మంది గిరిజన రైతులు సాగులో ఉన్నారు. సాగులో ఉన్న రైతులను బెదిరిస్తూ కొంతమంది భూ కబ్జాకోరులు 20.ఎకరాల భూమిని కబ్జా చేసి మైదానం ప్రాంతపు భూవ్యాపారులకు భారీ మొత్తంలో విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తూ బెదిరింపు ధోరణికి దిగుతున్నారని రైతులు.కొత్తూరు గ్రామపంచాయతీ సర్పంచ్ తదితరులు శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీ అరకు ఇంచార్జ్ దొరకు కలిసి ఫిర్యాదు చేసి కాపాడాలని కోరారు. కబ్జాకోరులువల్ల రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సర్పంచ్ దొరకు వివరించారు ప్రస్తుతంరిసర్వేలో రైతులపేర్లు నమోదు చేయడం జరిగిందని.అయినాప్పటికీ భూకబ్జాదారులు గ్రామాల్లోకి చొరబడి భూములను విడిచిపెట్టి ఇక్కడ నుండి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారని దొరకు తెలిపారు.ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఇంచార్జ్ హామీ ఇచ్చారు

# మారణహోమని ప్రతిఘటించండి





పాలస్తిన సంఘీభావ సదస్సు లో రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్

**జూన్ 20 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** ఎస్ఎఫ్ఐ 18 వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకొని న్యూ బాలాజీ సర్కిల్ లోని మేక్ మై బేబీ జీనియస్ పాఠశాల పక్కన సెమినార్ హాల్ నందు పాలస్తినా సంఘీభావంగా యుద్ధాలు ప్రభావాలు అంశం పై సెమినార్ నిర్వహించడం జరిగింది. దీనికి ముందు మహాసభల సూచికగా స్వాతంత్ర్యం ,ప్రజాస్వామ్యం, సోషలిజం గల ఎస్ఎఫ్ఐ పతాకాన్ని జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆవిష్కరించారు. ఈ సెమినార్ లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ పాలస్తీనా పై దుర్మార్గంగా చిన్నారులని, మహిళలు పై భయంకరంగా దాడులు కోసాగిస్తూ అమాయకుల ప్రాణాలను బలి కొనడం అత్యంత అమానుషం అని వారు అన్నారు. వేమూరి మెగా, పర్యావరణ ఉద్యమ కారిణి గ్రేట్ థన్ బర్గ్ లాంటి మానవత్వం చాటే వారి స్ఫూర్తితో మనం కూడా ప్రపంచంలో జరిగే మారణాహోమని ప్రతి ఘటించాలి అని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు నాగరాజు మాట్లాడుతూ వేమూరి లాంటి ప్రశ్నించే శక్తులు నేడు విద్యార్థులు గా మారాలని చెప్పారు. మన దేశ స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తి తో సామ్రాజ్య వాదని తరిమి కొట్టామని అదే వారసత్వం తో పాలస్తినా పై దాడులు ను ఖండించాలని వారు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ ఆకలి తో, అభద్ర భావంతో కొట్టి మిట్టడుతున్న నిస్సహాయకులకు ఐక్య రాజ్య సమితి తక్షణమే నిత్య అవసరలు తీర్చాలని, ఇజ్రాయిల్ ఒంటిరి పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, శివ, గణేష పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు స్లాగనీయం





శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి...

యువతకు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పిలుపు.

**జూన్ 20,తిరుపతి జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)** రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు అద్భుతంగా ఉన్నాయని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినన్ని పురస్కరించుకుని తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కచ్చపి ఆడిటోరియంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి , తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి , స్టేట్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలలో భాగంగా భారీ కేక్ ను కట్ చేసి భువనేశ్వరి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు అభిమానులు, టిడిపి కార్యకర్తలు దాదాపు 300 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను అతిధులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో నారా భువనేశ్వరి , చంద్రబాబు తో సమానంగా రాష్ట్రంలో పర్యటించి మహిళలందరినీ చైతన్యపరిచి పార్టీ అధికారంలోకి రావడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు స్వయం ఉపాధి పొందడానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా భువనేశ్వరి గారు అనేక కార్యక్రమాలు చేస్తున్నారని తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నారా భువనేశ్వరి గారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా శక్తి ఎంటో గత ఎన్నికల్లో నారా భువనేశ్వరి చూపించారని గుర్తు చేశారు.. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలతో సమావేశాలను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం నింపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేశారన్నారు. నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి భారీగా ప్రజలు తరలివచ్చి రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. స్టేట్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ మాట్లాడుతూ నారా భువనేశ్వరి ఒక పక్క కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ మరోపక్క రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ 18 వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి

**బద్వేల్ జూన్ 20 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈనెల కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో 27 నుండి 30 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి, వాల్ పోస్టర్లను విడుదల చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ కుమార్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) 1970 డిసెంబర్ 30న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా అధ్యయనం పోరాటం నినాదంతో ఏర్పాటై 55సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం 55 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ ముందుకు పోతుందన్నారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేస్తూ అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. పేద విద్యార్థికి విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. విద్యా పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యల పరిస్కారం కోసం ఎన్నో నిర్బంధాలని, అక్రమ కేసులను సైత్తం ఎదుర్కొంటూ పోరాటాన్ని ముందుకు కొనసాగిస్తుందని వారు అన్నారు. మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కనివ్వమని భగత్ సింగ్ స్ఫూర్తితో రాబోవు రోజుల్లో విద్యారంగ సమస్య పరిస్కారం కోసం పోరాటాలకు విద్యార్థులు సిద్ధం



అయ్యేందుకు విద్యార్థి సమస్యలు అలుపెరుగని పోరాటం చేసేందుకు ఈ యొక్క అఖిలభారత మహాసభలు నిర్వహిస్తున్నామని అందరూ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కమిటి మెంబెర్ నిత్య, రఘు,రోహన్, తదితరులు పాల్గొన్నారు.

## సీమాంక్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ టి ఎల్ ఎస్ బ్రహ్మయ్య పై చర్యలు

తీసుకోవాలి - ఏఐవైఎఫ్ డిమాండ్



**బద్వేల్ జూన్ 20 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణంలోని సీమాంక్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ టి ఎల్ ఎస్ బ్రహ్మయ్య పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు పెద్దుళ్ళపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు.సీమంక్ ఆసుపత్రిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ.... గత నాలుగు సంవత్సరాలుగా బద్వేల్ పట్టణంలోని సీమాంక్ హాస్పిటల్ లో క్షయ వ్యాధి డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఎస్టిఎల్ఎస్ బ్రహ్మయ్య సరిగా విధులకు హాజరు కాకుండా కడప కేంద్రంలోని ఒక హాస్పిటల్లో ప్రైవేట్ లాబ్ పెట్టుకొని ల్యాబ్లో పని చేసుకుంటూ బద్వేలులో విధులకు నెలలో కేవలం ఒకటి రెండుసార్లు మాత్రమే హాజరవుతూ ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తులు నమూనాలు ఇస్తే ఆ శాంపిల్స్ ని కూడా నెలలు నెలలు ఇక్కడే నిల్వ ఉంచుతూ వాటికి కనీస భద్రత లేకుండా కేవలం ఒక చిన్న బాక్సులో పెట్టి ఐస్ లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అతనికి బద్వేల్ నియోజకవర్గంతో పాటు దువ్వూరులో కూడా విధుల్లో ఉన్నప్పటికీ ఇక్కడ ఎటువంటి రిజిస్టర్ లో రాయకుండా ఎఫ్ఆర్ఎస్ ను కూడా తప్పుదోవ పట్టించి విధులకు రావడంలేదని వారు ఆరోపించారు. ఇతనిపై అధికారుల చర్యలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తనదే అధికారం అంటూ విధులకు హాజరు కావడం లేదు. కాబట్టి జిల్లా వైద్యశాఖ అధికారులు బ్రహ్మయ్య పై చర్యలు తీసుకొని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మధు, శివకుమార్ లు పాల్గొన్నారు.

## పురపాలక పరిధిలో 21న ఉత్సాహంగా యోగాంధ్ర కార్యక్రమం

ప్రజలు భారీగా పాల్గొనాలంటూ ఇంచార్జ్ కమిషనర్ పిలుపు





**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమం భాగంగా ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని 20 సచివాలయాల్లో రేపు శనివారం ఉదయం 5.30 నుంచి 7.30 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో ఇంచార్జి కమిషనర్ యస్.యస్.కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ పురపాలక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి వార్డులో ప్రజలతో యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగ సాధన ద్వారా కలిగే ఆరోగ్య లాభాలను వారిలో చైతన్యం కలిగించాలన్నారు. మన నిత్య జీవితంలో యోగా భాగంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ పి.లక్ష్మయ్య, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.

## డెజ్జింగ్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి మాజీ ఎమ్మెల్యే తలారి



**తాళ్లపూడి, జూన్20, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలో ఇటీవల ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన 7 డ్రేగ్జింగ్ బోట్లను మరియు ఇసుక ర్యాంపు పరిసరాలను స్థానిక వైసీపీ నాయకులు తో కలిసి పరిశీలించిన కొవ్వూరు వైసిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ తక్షణమే సీజ్ చేసిన బోట్లను గోదావరిలో నుండి బయటికి తరలించాలని ధ్వజమెత్తారుఅంతేకాకుండా దోషులుగాబోట్లయజమానులు మాత్రమే కాకుండా ఇసుక ర్యాంపు నిర్వాహకులను కూడా గుర్తించి ఇసుక ర్యాంప్ యాజమాన్యం పై కూడా కేసులు నమోదు చేయాలన్నారు ప్రభుత్వ అధికారులు కూటమి నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారిపోయారని దుయ్యబట్టారు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించకపోతే కార్యాచరణ తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు

# ప్లాస్టిక్ వాడకం మానవాళి మనుగడకు ప్రమాదకరం





**ప్లాస్టిక్ వినియోగం తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది**

**ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ప్రాస్టిక్ వాడకాన్ని ప్రతీ ఒక్కరూ నిషేధించాలి**



**ఆడపిల్ల సేవా సొసైటి ఫౌండర్ మడ్డి లావణ్య**

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ప్లాస్టిక్ వాడకం మానవాళి మనుగడకు అత్యంత ప్రమాదకరం అని ఆడపిల్ల సేవా సొసైటి ఫౌండర్,సచివాలయం మహిళా పోలీస్ మడ్డి లావణ్య అన్నారు. . ప్లాస్టిక్ నివారణే లక్ష్యంగా పొందూరు మండల కేంద్రంలో ఆడపిల్ల సేవా సోసైటి ఆధ్వర్యంలో పాత పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20 వ నుండి 26 వ తేదీ వరకు ప్లాస్టిక్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ,మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి ,పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ ప్రారంభించారు. అనంతరం ఇండ్లలలో , షాపులలో ఉపయోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయట పారవేయకుండా దాచి ఉంచి అందజేసిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చిగిలపల్లి రామ్మోహన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి తీవ్రమైన ముప్పు అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి ,నీరు ,గాలి కలుషితమై జీవ వైవిధ్యానికి హాని కలిగిస్తుందని తెలిపారు. అటువంటి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసేందుకు విశేషంగా కృషి చేస్తున్న మడ్డి లావణ్య ను ఆయన అభినందించారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం లో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మడ్డి లావణ్య మాట్లాడుతూ మన నిజ జీవితంలో ప్లాస్టిక్ వాడటం వలన పర్యావరణానికి ,ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ ను వాడి ఆ వ్యర్థాలను బయట పారవేయడం వలన అవి భూమిలో కలవడానికి ఎన్నో సంవత్సరాల సమయం పట్టడంతో పర్యావరణాన్ని కలుషితం చేస్తాయన్నారు. దీంతో జల కాలుష్యం , వాయు కాలుష్యము కలిగి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయడానికే నేడు ప్లాస్టిక్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు ఉపయోగించి దాచి ఉంచిన ప్లాస్టిక్ వ్యర్థాలను తమకు అందజేయడం ద్వారా వారికి ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించడానికి వీలుగా ఉంటుందన్నారు. అందజేసిన వారికి బహుమతులు అందించి వారిని మరింత ప్రోత్సహిస్తూ తద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి, ప్రతీ ఒక్కరి లో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. మనం చేసే ప్రతీ ఒక్క పని భవిష్యత్ తరాలకు మేలు చేసేదిలా ఉండాలని పేర్కొన్నారు. చుట్టూ ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ సమాజానికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ద్వారా యోగా పై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారని , యోగా లో శ్వాస తీసుకునే ప్రాణాయామ ప్రక్రియలు అత్యంత కీలకమైనవన్నారు. అటువంటి ప్రాణాయామానికి స్వచ్ఛ మైన గాలి అవసరమని ,పర్యావరణం కలుషితం కాకుండా ఉంటేనే స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. అందుకే ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ కు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , ఈ. ఓ కింతలి మోహన్ బాబు , ,కాలెపు శ్రీనివాస రావు ( కె.వీ.ఆర్ ), , దండా మురళీ ,కోరుకొండ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పోలవరం లో ఘనంగా రెవెన్యూ దినోత్సవం

**రిటైర్డ్ రెవెన్యూ సిబ్బంది సత్కరించిన...**

**తహసిల్దార్ సాయిరాజ్, ఎంపీడీవో, ఎస్సై, ఎంపీపీ, కూటమి నాయకులు**




**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ జూన్ 20** పోలవరం మండలం మండల తాసిల్దార్ కార్యాలయం నందు రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, టిడిపి అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని, పోలవరం ఎస్సై పవన్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రముఖులు ప్రసంగించారు. అలాగే ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమని పోలవరం తహసీల్దార్ సాయి రాజు అన్నారు. పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశాఖ ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం తహసిల్దార్ సాయి రాజు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనకు ముందే మనదేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉండేదని అన్నారు. ఆనాటి నుంచి నేటివరకు ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకంగా పనిచేస్తోందని వివరించారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. రెవెన్యూశాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే రెవెన్యూ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకోవడంతో పాటు రిటైర్డు రెవెన్యూ సిబ్బందికి రిటైర్డ్ తాసిల్దార్ అరవాల రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, రిటైర్డ్ వీఆర్వోలు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రిటైర్డ్ అటెండర్ రామారావు (రాంబాబు)పూల మాలలతో సాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కంభంపాటి శ్రీను, ఇంచార్జ్ ఆర్ ఐ భీమరాజు, ఇంచార్?

# రెవెన్యూ డే ను ఘనంగా నిర్వహించిన అధికారులు

**తాళ్లపూడి, జూన్ 20, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండల తాసిల్దార్ లక్ష్మి లావణ్య ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ "డే" ను కార్యాలయ సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తాళ్లపూడిలో రెవిన్యూ శాఖలో 10 సంవత్సరాలు పనిచేసి రిటైర్ అయిన షేక్ జలీల్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ లక్ష్మీ లావణ్యమాట్లాడుతూప్రజలతో మమేకమైన డిపార్ట్మెంట్ రెవెన్యూ శాఖ అని ఆమె అన్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వరదలు వచ్చినా తుఫాన్ వంటి ప్రమాదాలు జరిగిన రెవెన్యూ సిబ్బంది అన్ని సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. ప్రజల నుండి కొన్ని అవగాహన లేని విమర్శలు వచ్చినా కష్ట కాలంలో 24 గంటలు సర్వీసు అందించడానికి రెవెన్యూ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. డిప్యూటీ తాసిల్దార్ మోహన భారతి మాట్లాడుతూ 24 గంటలు అందుబాటులో ప్రజలకు సేవలు అందిస్తున్న రెవెన్యూ శాఖలో కొంతమంది ఉద్యోగులు చేసిన చిన్న చిన్న పొరపాట్లు వల్ల మాపై కొన్ని విమర్శలు చేయడం సరికాదని, అయినా గాని ప్రజలకు సేవ చేయడానికి మా సిబ్బంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రజలకు సేవ చేసే డిపార్ట్మెంట్లో మా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేసే ప్రతి ఉద్యోగి 24 గంటలు పనిచేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా అందరికి శు




భాకాంక్షలుతెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది సర్వేయర్లు పాల్గొన్నారు

# 11 సంవత్సరాలు పరిపాలనపై వికసిత్ భారత్ సంకల్ప సభ




**తాళ్లపూడి, జూన్ 20, ప్రజాజ్యోతి న్యూస్** వికసిత్ భారత్ అమృత కాలపు సేవ పేదల సంక్షేమానికి సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా వికసిత భారత సంకల్ప సభ తాళ్లపూడి మండలం లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల అందించిన సుపరిపాల విజయాలు మోడీ చేసిన వివిధ కార్యక్రమాలు అలాగే పథకాలను పరిమి రాధా ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలిశెట్టి సన్యాసి నాయుడు, మల్లిపూడి రాజేష్, ఫణిందల లింగాచారి, వెలుగబంటి బాలకృష్ణ, అనసూయమ్మ, టి. కృష్ణ, రంగయ్య, ప్రగడ సత్యనారాయణ, విష్ణు, నక్క వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

## గుంతకల్లు తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా రెవెన్యూ శాఖ దినోత్సవం




**గుంతకల్లు జూన్ 20 (ప్రజా జ్యోతి):** రెవెన్యూ శాఖ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంతకల్లు తాసిల్దార్ కార్యాలయం నందు ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ డి టి శ్రీ సర్వే ఎమ్మార్వో రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో శ్రీనివాసులు,తాసిల్దార్ రమాదేవి,రిటైర్డ్ తాసిల్దార్లు చలపతి,ఈవో రాముడు, సరస్వతి,శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఇస్లాం లు 600 సంవత్సరాలు పరిపాలించారు ఆ తర్వాత అక్బర్ పరిపాలనలో తాసిల్దార్ అనే పదమును వచ్చినది. మంత్రిగా తోడర్ మల్లు అనే ఆయన ఉండేవారు ఆయన నుంచి తాసిల్దార్ అనే పేరు వచ్చినది ఈ పదం అరబిక్ పదమని అన్నారు.అలాగే థామస్ మన్రో వ్యాపారులకు వచ్చి మన దేశంలో స్థిరపడి అధిక సంఖ్యలో అవినీతిప రులు అక్రమార్గంలో అహంకా రాలు ప్రజల పట్ల ఏమాత్రం అభిమానం లేని వారు కానీ ప్రధానంగా తెలుగు ప్రజల మరువలేని తెల్లదొరల్లో అగ్ర గన్యుడు థామస్ మన్రో అంతేకాక రాయలసీమ ప్రజలు కు ఆపద్బాంధవుడు అని కొనియాడారు.రైతు వారి వ్యవస్థను తీసుకొచ్చినటు వంటి గొప్ప మహా వ్యక్తినీ మన అనంతపురం జిల్లాలో గుత్తి కోట లో థామస్ మన్రో సమాధి కూడా ఉన్నదని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో భక్త రామదా సు కూడా తాసిల్దార్ గా పని చేసినటువంటి గొప్ప మహా వ్యక్తి వీరిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం రిటైర్డ్ తాసిల్దారులకు శాలువాలో పూలతో సన్మానం చేసి, కేక్ కట్ చేసి పంచిపెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో. నారాయణస్వామి, సి ఎస్ డి టి సుబ్బలక్ష్మి, ఆర్ ఐ లు, వీఆర్వోలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు సేవలు భేష్

**చురుకుగా పారిశుద్ధ్య పనులు**



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ఈ. ఓ కింతలి మోహన్ బాబు చురుకుగా పారిశుద్ధ్య పనులను సిబ్బంది తో చేపట్టారు. మేజర్ పంచాయతీ పొందూరు పరిధిలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఈ. ఓ రాత్రింబవళ్లు ముమ్మరంగా సిబ్బంది తో పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నారు . ఇటీవల జరిగిన పైడితల్లి అమ్మవారి పండుగ నిమిత్తం సుదీర ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడం , గ్రామంలో చెత్త చెదారం ఎక్కువ అవ్వడం తో పారిశుద్ధ్య సిబ్బందితో పురవీధులన్నీ శుభ్ర పరిచారు. బ్లీచింగ్ , క్లోరినేషన్ వంటివి చేపట్టి ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పండుగ ముగిసిన నాటి నుండి పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించారు.ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని , ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ. ఓ ప్రత్యేక దృష్టి సారించారు. పురవీధులన్నీ పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా కృషి చేశారు. ఈ మేరకు చురుకుగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న ఈ.ఓ పట్ల మేజర్ పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో యోగా శిక్షణా తరగతుల ముగింపు

**యోగాంధ్ర-2025 కార్యక్రమం భాగంగా రెండు రోజుల శిక్షణ విజయవంతం**



**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన యోగా శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. పిట్లవారిపాలెంలోని కేర్ యోగా న్యాచురోపతి మెడికల్ కాలేజ్ అనుసంధానంతో ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టారు.ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, యోగా మన పూర్వీకుల నుండి లభించిన అపూర్వ ఆస్తి అని, దాని ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని తెలిపారు.సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూచించారు వైస్ ప్రెసిడెంట్ పారేపల్లి చంద్రశేఖర్ ఉద్యోగ, విద్యాసంబంధ ఒత్తిడిని తగ్గించడంలో యోగా ఎంతో ఉపయుక్తమని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రమాదేవి, యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలని, విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి ఇది కీలకమన్నారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి. నిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల కోసం యోగా విద్యను సిలబస్‌లో ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ యోగా సభ్యులు డాక్టర్ సుచరిత, నాగేశ్వరరావు, యోగా బోధకులు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. కే. రాజేంద్ర, వై. శృతి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం సన్నిధికి ఒక్కలక్ష 1.01116 రూ విరాళం

**సుధాకర్ రైల్వే స్కూల్ రిటైర్డ్ టీచర్ వారిచే శ్రీ లక్ష్మీనారాయణ స్వామి శాంతి కళ్యాణం**



**గుంతకల్లు జూన్ 20 (ప్రజా జ్యోతి):** శుక్రవారం కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు పాలాభిషేకం సుధాకర్ రిటైర్డ్ రైల్వే స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ సతీమణి విజయ కుటుంబ సమేతంగా నిర్వహించడం జరిగింది. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం సుధాకర్ విజయ కుటుంబ సభ్యులు తమ వంతు సహకారంగా 1.01116 ఒక లక్ష వెయ్యినూట 16 రూపాయలు ఆలయ ధర్మకర్తలు తలారి పరుశురా ముడు శకుంతలమ్మ దంపతులకు అందజేశారు. వీరి కుటుంబ సభ్యులు రాధిక శశివర్ధన్ దంపతులు మరియు ఆలయ ధర్మకర్తలు దంపతులు ఉబయదారులై శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి శాంతి కళ్యాణం మహోత్సవం ఎంతో రమణీయంగా ఆలయ అర్చకులు రాకేష్ చెన్నకేశవ స్వామి నేతృత్వంలో చేయించడం జరిగినది. అనంతరం వారికి స్వామి ప్రసాదాలు శాలువాతో దంపతులను సన్మానించి వారికి ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం పరశురాముడు మాట్లాడుతూ స్వామి అమ్మవారి సేవకు సుధాకర్ వారి కుటుంబ సభ్యులు దేవస్థానము అభివృద్ధి కోసం ఒక లక్ష 1.01116 రూపాయలు విరాళంగా ఇవ్వడం వారి మంచి మనసుకు నిదర్శనని రైల్వే స్కూల్ టీచర్ గా పని చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమా లు చేశారని ఆలయంలో తన వంతు సేవ చేసుకుంటానని అన్నారు. దేవస్థానం అన్నదానంలో అందరిని భాగస్వాములు చేయాలనే దైవ సంకల్పంతో మీ పుట్టినరోజులు,మీ పెళ్లి రోజులు,మీ పిల్లల పుట్టిన రోజులు వివిధ శుభకార్యంలో ఆలయంలో ఒక్కరోజు స్వామివారి సేవకు నిత్య ధూప దీప నైవేద్యాలకు1125 రూ అదే రోజు మీ శుభ కార్యాలలో అన్న ప్రసాదం మీ పేరు పై 1225 రూపాయలు చెల్లించిన భక్తుల చేతుల మీదుగా అన్న ప్రసాదం జరుగును అందరూ ఈ దైవ పుణ్య కార్యంలో భాగస్వాము లు కావలెనని కోరుచూ స్వామి అమ్మవారి దివ్య ఆశీస్సులతో 8.8.2025 శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం రోజున వేద పండితుల భక్తుల పట్టణ ప్రముఖులు ఆధ్వర్యంలో వైభవంగా వైకుంఠ సుఖ దామం వసతి రూములకు నిర్మాణ భూమి పూజ అందరి సహకారంతో శాశ్వత సేవకై విరాళాలు ఇచ్చిన వారి ఫోటో పేర్లు శిలాఫలకం ఏర్పాటు చేయబడును, ఒక్క గది నిర్మాణానికి 6 లక్షల రూపాయలు ఈ ధర్మ కార్యానికి మనసున్న మహారాజులు అందరూ ముందుకు రావాలని కోరుచున్నామని తలారు పరశురాముడు తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు అందులో ఒకరు తలారి పరుశురాం ఈరోజు సమాజం లో సామాన్య కుటుంబంలో జన్మించి నేనంటూ మనిషిగా భూమ్మీద పుట్టాను నాదంటూ గుర్తు ఉండాలని టి పి ఆర్ ట్రస్ట్ ద్వారా అనేక విద్యా వైద్య ఉపాధి సేవ కార్యక్రమంలో చేస్తూ మన ఉన్నంతవరకే ఈ సేవలు ఉంటాయని అలా కాకుండా శాశ్వత గుర్తు ఉండాలని సమాజానికి శాశ్వత పుణ్యకార్యాన్ని చేయాలని దృఢ సంకల్పంతో కసాపురంలో కోట్ల విలువైన సొంత స్థలం లో కోట్ల విలువైన రాతి దేవస్థానం కట్టడం ప్రతిరోజు నిత్య అన్నదానం వందలాది మందికి అన్న ప్రసాదం అందించడం ఒక్కనెలకు దేవాలయం మెయింటెనెన్స్ ఆలయ సిబ్బంది జీతాలు నిత్యవసర సరుకులు అన్నదానంకు రెండు లక్షల 2.50,000 పైగా ఖర్చు చేస్తూ దేవస్థానంకు అన్నదానా నికి వచ్చే భక్తులను ప్రేమ ఆప్యాయతగా చిరునవ్వుతో పలకరిస్తూ అందరి ఆదరాభి మానాలు పొందుతున్న తలారి శకుంతలమ్మ పరశురాముడు దంపతులు ఎందరికో ఆదర్శం అన్నారు. ఉన్నంతలో ఉన్నత సేవ చేయాలని ప్రతి ఒక్కరూ ఈ దైవ పుణ్య కార్యాల్లో భాగస్వాములు కావాలని అన్నారు.నేను చేసినది ఉడతా భక్తి సేవగా భావిస్తున్నానని ఎంతటి భాగ్యం నా కల్పించిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారికి సర్వదా స్వామివారి సేవలోనే ఉంటామని అన్నారు ఈ కార్యక్రమంలో రాజమ్మ సులోచన సరోజమ్మ ఈశ్వరి శివ,ఓం శాంతి ప్రసాద్, భక్తులు మహిళలు భక్తులు పాల్గొనడం జరిగినది.

# కాలానుగుణంగా పంట సాగు విధానాలు మారాలి

**డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు**



**జి సిగడాం ,ప్రజా జ్యోతి న్యూస్:** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. శుక్రవారం నాడు జి సిగడాం మండలం దవలపేట గ్రామంలో విజయనగరం పార్లమెంట్ బీసీ సెల్ కమిటీ అధికార ప్రతినిధి ,మాజీ సర్పంచ్ కంచ రాన సూరన్ననాయుడు కు సంబంధించి సుమారు 5 ఎకరాలలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ ద్వారా సాగవుతున్న వరి సాగు క్షేత్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవలి రోజుల్లో వాతావరణంలో మార్పుల వల్ల జూలై మూడవ వారం వస్తున్నా అవసరమైన వర్షాలు పడకపోవడం రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు.కాబట్టి రైతులు ముందస్తుగా మేలుకొని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. వర్షాకాలం ఆరంభం తక్కువ నీటి వినియోగంతో పంటలు పండించదగ ఆరు తడి విధానాలైన ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించి వరి సాగు చేయడం అన్ని విధాల లాభదాయకం అన్నారు. దీనివలన సగం విత్తనాలు ఆదా అవడంతో పాటు, నారు పోసి, పొలం దమ్ముచేసి, నాట్లు వేసే పద్ధతి లేదు కాబట్టి కూలీలు. ఖర్చు కూడా దాదాపు ఐదు వేల రూపాయలు ఆదా అయింది రెండు తడిలేని ఆదా చేయాలంటే విత్తనాలు 15 కేజీల నుంచి 18 కేజీల వరకు అవసరం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా విజయనగరం పార్లమెంట్ బీసీ సెల్ కమిటీ అధికార ప్రతినిధి ,మాజీ సర్పంచ్ కంచ రాన సూరన్ననాయుడు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయం లో యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఫెర్టి కం సీడ్ డ్రిల్ ను ఉపయోగించడం ద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు. విత్తనాలు ,ఎరువులను వేసే పనులను రెండింటినీ ఒకే సారి చేయడం తో సమయం తో పాటు శ్రమ ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు డి. సూర్యనారాయణ, జె.రామసాయి, రైతుసోదరులు పాల్గొన్నారు.

## ఇంకొల్లులో డాక్టర్ డివిఆర్ సైనిక పాఠశాల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**త్వరలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రారంభించనున్న పాఠశాల**




**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జిల్లాలోని ఇంకొల్లు గ్రామంలో నిర్మించిన డాక్టర్ డివిఆర్ సైనిక పాఠశాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి శుక్రవారం పరిశీలించారు. త్వరలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ పాఠశాల భవన సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఇంకొల్లు మండలంలోని 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ పాఠశాలలో మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు బోధన చేపట్టనున్నారు. మొత్తం 72 గదులతో కూడిన ఈ భవన సముదాయాన్ని, తరగతి గదులు, వసతి గృహ సదుపాయాలను కలెక్టర్ సుదీర్ఘంగా పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, అవసరమైన ప్రభుత్వ అనుమతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి కార్యక్రమం ఖరారైన వెంటనే ప్రారంభానికి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, డీఈవో పురుషోత్తం, తహసీల్దార్ ఏ.వి.ఎస్. శ్రీనివాస్, ఎంపీడీవో తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## తల్లికి వందనం పథకం కింద ఎన్పీసీఐ, ఈకేవైసీ, వివిధ రకాల అప్డేషన్ ప్రక్రియలు ఇబ్బందులు లేకుండా చేపట్టాలి

**బ్యాంకులు, పోస్టాఫీస్ ల వద్ద రద్దీ కాకుండా చర్యలు తీసుకోవాలి**

**ఎప్పటికప్పుడు ఎల్డీఎం మానిటర్ చేయాలి**

**టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**



**అనంతపురం, జూన్ 20 )ప్రజా జ్యోతి):** తల్లికి వందనం పథకం కింద ఎన్పీసీఐ, ఈకేవైసీ,వివిధ రకాల అప్డేషన్ ప్రక్రియలకు సంబంధించి బ్యాంకులు,పోస్టాఫీస్ ల వద్ద ఇబ్బందులు లేకుండా చేపట్టే లా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం తల్లికి వందనం పథకం కింద ఎన్పీసీఐ, ఈకేవైసీ, వివిధ రకాల అప్డేషన్ ప్రక్రియలకు సంబంధించి ఎల్డిఎం నరేష్ రెడ్డి, వివిధ బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, పోస్టాఫీస్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఎన్పీసీఐ అప్డేట్ చేయాలని, ఈకేవైసీ కావాలని, వివిధ రకాల అప్డేషన్ జరుగుతోం దని, ఎవరైనా పిల్లలు, తల్లులు చనిపోతే అప్డేషన్ మిగిలిపోయిన వారు ఆ ప్రక్రియల్ను చేసుకుంటున్నా రని, ఈ ప్రక్రియలను పూర్తి చేసుకోవడానికి పిల్లలు, తల్లిదండ్రులు బ్యాంకులకు, పోస్టాఫీస్ లకు వస్తున్నార న్నారు. బ్యాంకులు, పోస్టాఫీస్ ల వద్ద ఎలాంటి రద్దీ కాకుండా సమయాలను నిర్వహించా లని, అవసరమైతే అదనపు సమయాన్ని కేటాయించాల న్నారు. బ్యాంకులు, పోస్టాఫీస్ లలో షిఫ్ట్ లను ఏర్పాటు చేసి సెక్యూరిటీని ఉపయోగించి క్యూలను మేనేజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా లో ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవా ల్సిన బాధ్యత బ్యాంకులు, పోస్టాఫీస్ అధికారులపై ఉందని,ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.బ్యాంకు లు, పోస్టాఫీస్ లను లీడ్ జిల్లా మేనేజర్ తనిఖీ చేయాలని, ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నా రు. ఇందులో ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవా లని జిల్లా కలెక్టర్ ఆదేశించా రు.

## కాలువ పూడిక తీత పనులు ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ నాయుడు



**(బూర్జ )ప్రజా జ్యోతి** మండలంలోని ఓనిగడ్డ కాలువ పూడికతీత పనులను ప్రారంభించిన ఆంధ్ర ప్రదేశ్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ నాయుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో కాలువాల్లో పూడిక తీయక పోవడంతో చివర రైతులకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని . గత ప్రభుత్వానికి రైతులు పలుమార్లు సాగునీరు రావట్లేదని మొరపెట్టుకున్న పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కాలువ ద్వారా ప్రతి రైతుకు సాగు నీరు అందుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాడ శ్రీనివాసరావు ,కడగల కృష్ణ దాశరెడ్డి మౌళేశ్వరరావు, వావిలపిల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంలో యోగ శిక్షణ

**32 రకాల యోగాసనాలు, సూర్య నమస్కారాలు పరిచయం**



**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ ట్రైనర్లు ధూళిపాల శైలజ, గురజాల శ్రీనివాసరావు, కర్పూరపు మంజులత, ఎం. కృష్ణారావు, ఎం. సూరిబాబు, ఓ. శైలజ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.శిక్షణలో భాగంగా 32 రకాల యోగాసనాలు, సూర్య నమస్కారాల ప్రాథమిక అంశాలను బీజేపీ నాయకులకు వివరించారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే మార్గాలను వివరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బ్రహ్మండం బాలనారాయణ, రూరల్ అధ్యక్షులు నక్కా పేరిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు ఎస్‌బీజీ తిలక్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, కొండారెడ్డి అనిల్ కుమార్, కొ్ట్రా వెంకట రామకృష్ణ పాల్గొన్నారు

## ఆర్డీవో ఆఫీసులో రెవిన్యూ డే సంబరాలు.

**రిటైర్డ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి ఎండి హుస్సేన్ ను సన్మానించిన ఆర్డిఓ**



**ప్రజా జ్యోతి పత్తికొండ** రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండ ఆర్డిఓ ఆఫీసులో రెవెన్యూ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్ కేక్ కట్ చేసి రెవిన్యూ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ డివిజన్ పరిధిలోని 9 మండలాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో భరత్ నాయక్ మాట్లాడుతూ స్వాతంత్రం రాక ముందు నుంచి రెవెన్యూ పాలన సాగుతుందని గుర్తు చేశారు. ప్రజలు తమ పని నిమిత్తం రెవెన్యూ ఆఫీసుకు వచ్చిన వారితో సహృదయంతో పలకరించి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులు ముందుకు అడుగు వేసి ప్రజల మన్ననలను పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ టిఎండి హుస్సేన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉపయోగపడవలసిన కమ్యూనిటీ హాల్ భవనం

**మందుబాబులకు నిలయంగా మారింది.**



**అనంతగిరి జూన్. 20 ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** మండల కేంద్రమైన అనంతగిరిలో 5.లక్షల 50.వేల రూపాయలునిధులు ఖర్చు చేసి ప్రజల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ భవనం నిర్మిస్తే నిర్వహణ లేక ప్రజలకు ఉపయోగపడక ఎంతో విలువైన భవనం నేడు మందుబాబులకు నిలయంగా మారింది. అధికారులు. పాలకులు పట్టించుకోకపోవడం వలనే భవనం ఇలా తయారయిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి చొరవ చూపి శాఖాపరమైన చర్యలు తీసుకుని భవనానికి పూర్వ వైభవం తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు . ఇంతకీ ఈ భవనంఏశాఖ ఆధీనంలో ఉంది పంచాయితీ అధీనమా లేక మండల పరిషత్ అదేనమా. ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# రెవెన్యూ శాఖకు విశిష్ట హెూదా

రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ వెంకట మురళి

**బాపట్ల జూన్ 20 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** భూమి దస్త్రాలతోనే రెవెన్యూశాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శుక్రవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన రెవెన్యూ అధికారుల్ని, సిబ్బందిని కలెక్టర్ సత్కరించి, అవార్డులు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజల సంక్షేమానికి, విపత్తుల సమయంలో, భూ పరిపాలనలో రెవెన్యూ శాఖ సేవలు అమూల్యమైనవిగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ శాఖలన్నింటికీ మాతృశాఖగా నిలిచే రెవెన్యూశాఖ పుట్టినరోజు (రెవెన్యూ డే)ని అధికారికంగా నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చినందుకు సంతోషంగా ఉంది అని పేర్కొన్నారు. రెవెన్యూ బోర్డు ఏర్పడి 240 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రెవెన్యూశాఖలో పని చేసే ప్రతి ఉద్యోగి చట్టాలు, జీవోలు, భూమి సంబంధిత వ్యవస్థలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విపత్తుల సమయంలో సేవలందించే రెవెన్యూశాఖ ఉద్యోగులు వెల కట్టలేని పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ముగ్గురు తహసీల్దార్లు సీతారత్నం, త్రిపుర బాలసుందరమ్మ, వెంకటరత్నంలను పదవీ విరమణ సందర్భంగా ప్రత్యేకంగా



సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ, జనన, మరణ, ఆదాయ, కుల ధృవీకరణ వంటి అనేక కీలక ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే అధికారాలు రెవెన్యూశాఖకు మాత్రమే ఉన్నాయని, ఇది మాతృశాఖగా ప్రాముఖ్యత పొందిందని చెప్పారు. విపత్తు నిర్వహణ, ఎన్నికల సజావుగా నిర్వహణ వంటి కీలక అంశాల్లో రెవెన్యూశాఖ నిరంతరంగా సేవలందిస్తోందన్నారు. ఆర్డీవో పి. గ్లోరియా మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం చేయడంలో రెవెన్యూశాఖ ప్రథమ స్థానంలో నిలుస్తోంది అన్నారు. ఉప కలెక్టర్ లవన్న మాట్లాడుతూ, యాజమాన్య హక్కుల పరంగా భూమికి సంబంధించి రెవెన్యూశాఖ కీలకంగా వ్యవహరిస్తోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే, ల్యాండ్స్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కనకరాజు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వెల్దుర్తిలో రెవెన్యూ డే ఘనంగా జరిగింది








**(ప్రజా జ్యోతి రిపోర్టర్) 20-06-2025** వెల్దుర్తి మండల రెవెన్యూ కార్యాలయంలో తాహసీ ల్దార్ చంద్రశేఖర్ వర్మ సమక్షంలో శుక్రవారం రెవిన్యూ డే లో ముందుగా ఆయన అతిధులతో కలిసి కేక్ కట్ చేశారు గతంలో వెల్దుర్తి తహసిల్దార్గా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగి మద్దిలేటి గారు నార్లాపురం పదవి విరమణ పొందియున్నారు వీఆర్ఓ గా పనిచేసిన లక్ష్మిరెడ్డి పదవి విరమణ పొందినాడు వయసు పైబడిన వీఆర్ఏలను ఘనంగా సన్మానించారు తహసిల్దారు పదవి విరమణ పొందిన డిప్యూటీ తాసిల్దార్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చినవారు ప్రముఖ పారిశ్రామికవేత్త సాయి ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం రాకముందు ఈస్ట్ భారతదేశ పాలకులు 1786 జూన్ 20వ తారీఖున రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేసినారు మొదటి రెవిన్ డే గా నిర్వహించుకోవడం ఎవరైతే పదవి విరమణ పొందినవారిని ఆనందంగా సీనియర్లను సన్మానించడం జరిగినది రెవిన్యూ శాఖ నుంచి ప్రజలకు సేవ చేసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లినారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జానకి బాయ్ ఇటీవలన బదిలీ అయినా ఏఎస్ఓ అభిమన్యుడు డిటి గురుస్వామి రెడ్డి ఆర్ఐ మంజుల సర్వేర్ డిటి రామలక్ష్మి విఆర్వోలు వీఆర్ఏలు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సాక్ష్యం చెప్పడానికి రండి

**హైదరాబాద్ :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరింత విస్తరిస్తోంది. ఇది ఒకరిద్దరికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలంతా ఈ సర్వైలెన్స్‌లోకి వచ్చేశారా అనే అనుమానం కలుగుతోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లు ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించారట. ఇప్పుడు ఆ దిశగా దర్యాప్తు టర్న్ అవుతున్నట్టు తెలుస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సంబంధించిన వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయాలేదా అనే విషయాన్ని గుర్తించేందుకు కరీంనగర్ బీజేపీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావును సిట్ అధికారులు పిలిచారు. గతంలో జరిగిన ఘటనలు వివరించాలని ఆదేశించారు. ఇప్పుడు ఆయన చెప్పే సాక్ష్యం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నారు. బండి సంజయ్‌కు ప్రవీణ్‌రావు చాలా సన్నిహితుడు. టెన్త్‌పేపర్ లీక్, బైంసా అల్లర్లు, ఇతర కార్యక్రమాల్లో బండి సంజయ్‌తోపాటు ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఎప్పుడూ వెన్నంటి ఉండే ప్రవీణ్‌రావు ఫోన్‌ను అప్పట్లో ట్యాప్ చేసినట్టు అధికారులు తేల్చారు. ఇప్పుడు వాటిపై నిగ్గు తేల్చే పనిలో ఉన్నారు. అందుకే ఆయనకు నోటీసులు పంపించి విచారణకు పిలుస్తున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సిట్ ముందు హాజరై తమ ఫోన్‌లు ట్యాప్ అయినట్టు వాంగ్మూలం ఇస్తున్నారు. అందుకు సాక్ష్యాలను కూడా సిట్ అధికారులు అందజేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ హాజరై సిట్‌కు స్టేట్మెంట్ ఇచ్చారు. ఇప్పుడు చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ లీడర్లు సిట్ విచారణకు హాజరయ్యారు.



### సాక్షులుగా స్టేట్మెంట్‌లు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ నాయకుడు, తవక్కల్ విద్య సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్, మందమర్రి కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముజాహిద్ హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో చాలా ఇబ్బంది పడ్డట్టు చెప్పారు. బాల్క సుమన్ లాంటి వారు హింసించారని ఆరోపించారు. వివేక్‌కు మద్దతుగా ఉన్నందుకు ఫోన్‌లు ట్యాప్ చేసి బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. పోలీసులు, కీలక నేతలు భయపెట్టారని అన్నారు. తమ ఫోన్ ట్యాప్ అయిన సంగతి సిట్ అధికారులు చెప్పే వరకు తెలియదని తర్వాత నాటి సంగతులు గుర్తుకు వచ్చాయని అన్నారు. దాదాపు ఆరు నెలల పాటు తమను వెంటాడినట్టు చెప్పుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావును కూడా సిట్ అధికారులు పిలిచి విచారించారు. సాక్షిగా వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఉదయం 10.30కి ఆయన తన స్టేట్మెంట్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలోనే ఫోన్ ట్యాపింగ్ కుట్ర జరిగిందని ఆరోపించారు. అధికారులు కీలకమైన వ్యక్తుల ఫోన్‌లు ట్యాప్ చేసి సమాచారాన్ని కేసీఆర్, సంతోష్‌కు చేర్చేవారని అన్నారు. ఇలా చేయడం వల్లే ఓటుకు నోటుఅంశం వెలుగు చూసిందని తెలిపారు. కవిత, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు లాంటి వాళ్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని విమర్శించారు. రాజకీయ నాయకులతోపాటు సినిమా, బిజినెస్ వాళ్ల ఫోన్‌లు కూడా ట్యాపప్ చేశారని ఆరోపించారు.

### సుప్రీం కోర్టుకు సిట్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ కొత్తకొత్త విషయాలు? విచారణ లోతుకు వెళ్లే కొద్దీ సరికొత్త అంశాలు వెలుగులోకొస్తున్నాయి. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావును ఇప్పటికే మూడుసార్లు ప్రశ్నించిన అధికారులు?ఆయన నుంచి సరైన సమాధానం లేకపోవడంతో ఇవాళ నాలుగోసారి కూడా విచారించారు. పదుల సంఖ్యలో ప్రశ్నలు సంధించారు. అయితే ప్రభాకర్ రావు వ్యవహారంలో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిట్ సిద్ధమవుతోంది. ప్రభాకర్‌రావుకు రిలీఫ్ రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరనుంది. మరోవైపు కస్టోడియల్ విచారణ కోసం నాంపల్లి కోర్టులోనూ పిటిషన్ వేసే అవకాశం కనిపిస్తోంది. ట్యాపింగ్ కేసులో నిన్నటికి నిన్న సస్పెండెడ్ డీఎస్పీ ప్రణీత్‌రావునూ విచారించారు అధికారులు. ఎన్నికల ముందు ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్‌ను ప్రణీత్ రావు లీడ్ చేయడంతో పాటు రాజకీయ నేతలు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు గుర్తించిన అధికారులు? పలు ఆధారాల ను ఆయన ముందుంచి ప్రశ్నించారు. అయితే ప్రణీత్‌రావు పలు కీలక డాక్యుమెంట్లు అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు బాధితుల వాగ్మూలాలను రికార్డ్ చేస్తున్నారు అధికారులు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు మరో 20మంది వరకు సాక్షులు తమ వాంగ్మూలాలను ఇచ్చారు. మొత్తంగా? అమెరికా నుంచి ప్రభాకర్‌రావు వచ్చాక స్పీడ్ పెంచిన సిట్ అధికారులు? ఎలా ముందుకెళ్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

## అంతర్జాతీయ యోగా డేలో ప్రతి ఒక్కరు విరివిగా పాల్గొనాలి.

ఎంపీడీవో లక్ష్మి కుమారి




**కంచికచర్ల, జూన్ 20 (ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కంచికచర్ల మండల ప్రజా పరిషత్ పరిధిలో గల 17 గ్రామ సచివాలయాలలో యోగ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి ఎం లక్ష్మీ కుమారి తెలిపారు. కంచికచర్ల మండల పరిషత్తు పరిధిలోని గుర్తించిన మొత్తం 121 ప్రదేశాలలో యోగ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంచికచర్లకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనూ కంచికచర్ల మార్కెట్ యార్డ్ నందు యోగ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## యోగా దినోత్సవం విజయవంతం చేయాలి:

ఎంపిడిఓ

**పోడూరు /ఆచంటజూన్ 20,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ను రేపు జూన్ 21 న మండలంలోని 15 సచివాలయం ల పరిధిలో యోగా శిక్షణ కార్యక్రమం లు నిర్వహించి యోగాంధ్ర కాంపెయిన్ లో రిజిస్టర్ అయిన వారికి యోగా లో ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు ను ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ ఆదేశించారు ఎంపిడిఓ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, ప్రత్యేక అధికారి పిచ్చయ్య తహశీల్దార్ జి కనకరాజు ఇతర మండల అధికారులు కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు అనంతరం 15 సచివాయం లకు 15 మంది మండల స్థాయి అధికారులను యోగా కార్యక్రమం పర్యవేక్షణకు నియమించి వారు 21 వ తేదీ ఉదయం 6 గం కు సచివాలయం లో హాజరై ఆ గ్రామంలో నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్యక్రమం అనంతరం యాప్ లో డేటా అప్లోడ్ చేయించాలని తెలిపారు అనంతరం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లకు అవగాహన సమావేశం నిర్వహించి రేపటి కార్యక్రమం కు ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారి, సెక్రటరీ లకు కార్యక్రమం నిర్వహణలో సహకరించాలని ఆదేశించారు ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ ప్రత్యేక అధికారి పిచ్చయ్య తహశీల్దార్ జి కనకరాజు మండల అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు బి కృష్ణ మోహన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి చైర్మన్ యోగాంధ్ర కాంపెయిన్ 2025 ఆచంట మండలం

## వెల్దుర్తిమండలంలోని యోగాంధ్ర దినోత్సవం

**(ప్రజా జ్యోతి రిపోర్టర్) 20-06-2025.** వెల్దుర్తి మండలంలోని శనివారం నాడు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నా యోగాంధ్ర కమిటీ చైర్మన్ వెల్దుర్తి మండల ఎంపీడీవో సుహాసిని మేడం గారు తెలిపినారు ఈ పత్రిక ప్రకటన ద్వారా అందరికీ తెలియ జేయడమేమనగా రేపు అనగా 21 జూన్ తేదీన వెల్దుర్తి మండలంలో గల 18 సచివాలయలలో గల 155 వెన్యులలో యోగాంధ్ర కార్యక్రమం జరుగును. ఉదయం 6 గంటలకు అందరిని సమావేశ పరిచి ఉదయం 7 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం జరుగును. కావున ప్రజలందరూ తమకు దగ్గరలో ఉన్న వెన్యుల యందు పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనదిద

## నర్సాపురం గ్రామంలో తలారి మరణం



**( ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 20-06-2025** వెల్దుర్తి మండలం నర్సాపురం గ్రామ తలారి మద్దిలేటి (48) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించినాడు అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. అతన్ని పరామర్శించడానికి గ్రామ టిడిపి నాయకులు ఎన్ రాజేశ్వర్ రెడ్డి పి రాముడు గ్రామ ప్రజలు ఎస్ కృష్ణారెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొని కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని అధికారులను కోరుచున్నారు

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**జగిత్యాల :** సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని లింగంపేట్ గ్రామంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పర్యటించారు. ఈ సంధర్భంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాబోయే 3 నెలల పాటు పారిశుధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పారిశుద్ధ్య కమిటీలలో వైద్య శాఖ సిబ్బంది భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఆశా కార్యకర్తల దగ్గర అన్ని విధాల మందులు జ్వరం, దగ్గు ,సీజనల్ వ్యాధులు సంబంధించి ప్రజలకు అవసరమైన మేరకు అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం గ్రామాలలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని,డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు.

## థాయ్‌లాండ్‌లో కొడుకు పెళ్లి.. ఏసీబీ కస్టడీకి నూనె శ్రీధర్..

**హైదరాబాద్ :** కాళేశ్వరం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ను కస్టడీకి తీసుకొని విచారించనున్నారు ఏసీబీ అధికారులు. కరీంనగర్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నటువంటి శ్రీధర్ నివాసం కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు పది రోజుల క్రితం సోదాలు నిర్వహించి రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు. అంతేకాకుండా కుమారుడి వివాహం థాయిలాండ్‌లో చేయగా రిసెప్షన్ హల్దీ ఫంక్షన్స్ రిసార్ట్లల్లో పలు హోటల్స్ లలో నిర్వహించారు. అధికారులు గుర్తించినటువంటి ఆస్తుల్లో తెల్లాపూర్ లోని విల్లా షేక్పేట్ లో గేటెడ్ కమ్యూనిటీ హాల్లో ప్లాట్, అమీర్‌పేట్‌లో కమర్షియల్, కాంప్లెక్స్ కరీంనగర్‌లో మూడు ప్లాట్లు, హైదరాబాద్ వరంగల్ కరీంనగర్లలో మూడు భవనాలు, 16 ఎకరాల భూమి, 19 ఇళ్ల స్థలాలు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను గుర్తించారు. ఈ విధంగా పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com